

తీరంలో తాబేళ్ల మృత్యు ఘోష

- సంతానోత్పత్తికి వచ్చి వేలాదిగా చనిపోతున్న కూర్మాలు
- మరణశాసనం రాస్తున్న వలలు, కాలుష్యం
- ఏపీ తీరంలో గత నెలలో 3,085 మృత్యువాత
- జాగ్రత్త చర్యలు తీసుకుంటున్న ఒడిశా, తమిళనాడు
- మన రాష్ట్రంలో చట్టాల అమలులో ఉదాసీనత



- 8వ పేజీలో

పుంజుకున్న రిజిస్ట్రేషన్లు

జనవరిలో భారీగా లావాదేవీలు

- 30, 31 తేదీల్లోనే రూ.35.6 కోట్ల ఆదాయం
- గత ఆర్థిక సంవత్సరం మొదటి పది నెలల్లో రూ.693.77 కోట్ల ఆదాయం, ఈ ఏడాది రూ.716.59 కోట్లు...
- 3.29 శాతం వృద్ధి
- ఫిబ్రవరి, మార్చి నెలల్లో రూ.300 కోట్ల ఆదాయం వస్తుందని అధికారుల అంచనా

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ ఆదాయంలో గతం కంటే మెరుగైన పనితీరు ప్రదర్శించింది. ప్రభుత్వం భారీగా లక్ష్యం ఇవ్వగా మారిన రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో స్థిరమైన ఆదాయం సాధించడానికి కాసింత సమయం తీసుకుంటోంది. డిసెంబరు నెలాఖరు వరకూ గత ఆర్థిక సంవత్సరంతో పోల్చుకుంటే అభివృద్ధి తక్కువగా ఉండగా, జనవరి నెలలో మాత్రం 'మైనస్' నుంచి 'ప్లస్'కు వచ్చింది. వృద్ధిని నమోదుచేసింది.



జనవరి 31వ తేదీన సూపర్‌బజార్ వద్ద రిజిస్ట్రార్ కార్యాలయంలో రద్దీ

ఫిబ్రవరి ఒకటో తేదీ నుంచి సవరించిన (పెంచిన) భూముల రేట్లు అమలులోకి వస్తాయని ప్రకటించడంతో జనవరి నెల చివరి వారంలో భారీగా రిజిస్ట్రేషన్లు జరిగాయి. మూడు రోజులు వరుసగా అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లోను రెట్టింపు డాక్యుమెంట్లు వచ్చాయి. జిల్లాలో జనవరి 30, 31 తేదీల్లో 1,534 డాక్యుమెంట్లు రిజిస్టర్ అయ్యాయి. వీటి ద్వారా రెండు రోజుల్లోనే రూ.35.6 కోట్ల ఆదాయం వచ్చింది. దీంతో అప్పటివరకూ మైనస్‌లో ఉన్న విశాఖ జిల్లా ఆదాయం గత ఏడాది కంటే 3.29 శాతం పెరిగి సానుకూల పరిస్థితులు ఏర్పడ్డాయి. గత ఆర్థిక సంవత్సరంలో ఇదే కాలానికి అంటే ఏప్రిల్ నుంచి జనవరి నెలాఖరు వరకు రూ.693.77 కోట్లు ఆదాయం రాగా, ఇప్పుడు జనవరితో ముగిసిన పది నెలలకు రూ.716.59 కోట్లు వచ్చింది. ఈ రెండు నెలల్లో అంటే ఫిబ్రవరి, మార్చి నెలల్లో మరో రూ.300 కోట్ల ఆదాయం సాధించి, 2024-25లో వేయి కోట్ల రూపాయల ఆదాయం చూపిస్తామని అధికార వర్గాలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నాయి.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల వారీగా...

కార్యాలయం	ఏడాది లక్ష్యం	ఇప్పటివరకూ లభించిన ఆదాయం	గత ఏడాది ఇదేకాలపు ఆదాయం
ఆనందపురం	రూ.72.18 కోట్లు	రూ.48.84 కోట్లు	రూ.45.73 కోట్లు
భీమునిపట్నం	రూ.68.36 కోట్లు	రూ.40.02 కోట్లు	రూ.47.57 కోట్లు
ద్వారకానగర్	రూ.119,63 కోట్లు	రూ.69.99 కోట్లు	రూ.72.04 కోట్లు
గాజువాక	రూ.119.6 కోట్లు	రూ.76.58 కోట్లు	రూ.73.95 కోట్లు
గోపాలపట్నం	రూ.89.41 కోట్లు	రూ.44.82 కోట్లు	రూ.46.57 కోట్లు
మధురవాడ	రూ.266.91 కోట్లు	రూ.177.31 కోట్లు	రూ.158.83 కోట్లు
పెందుర్తి	రూ.92.88 కోట్లు	రూ.51.97 కోట్లు	రూ.51.76 కోట్లు
సూపర్‌బజారు	రూ.276.3 కోట్లు	రూ.141.54 కోట్లు	రూ.134.99 కోట్లు
పెదగంట్యాడ	రూ.99.74 కోట్లు	రూ.65.53 కోట్లు	రూ. 62.32 కోట్లు

ముఖ్యంగా సింహాచలం దేవస్థానానికి చెందిన పంచ గ్రామాల సమస్యకు ప్రభుత్వం పరిష్కారం చూపించిందని, ఆ వివాదానికి సంబంధించి సుమారుగా ఐదు వేల వరకు

... మిగతా 6వ పేజీలో

పూర్ణామార్కెట్‌లో బినామీ దందా

ఒక్కొక్కరి చేతిలో నాలుగు నుంచి ఎనిమిది దుకాణాలు

- రోజుకు రూ.200 నుంచి రూ.300 అద్దె వసూలు
- జీవీఎంసీకి మాత్రం రూ.32 ఆశీల్ చెల్లింపు
- నిబంధనలకు విరుద్ధం
- గతంలో ఒక్కొక్కరికి ఒక్కొక్కటి మాత్రమే కేటాయింపు
- కొంతమంది దౌర్జన్యంగా చేజిక్కించుకుంటున్న వైనం
- అన్నీ తెలిసినా అధికారుల మౌనం

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

పూర్ణామార్కెట్‌లో నిబంధనలకు విరుద్ధంగా అనేక కార్యకలాపాలు నడుస్తున్నాయి. జీవీఎంసీ గతంలో ఒక్కో వ్యాపారికి ఒక్కో దుకాణాన్ని మాత్రమే కేటాయించగా, కొంత మంది దౌర్జన్యంగా, అధికారుల అండదండలతో నాలుగు నుంచి ఎనిమిది దుకాణాల వరకూ తమ గుప్పిట్లోకి తెచ్చుకున్నారు. ఇలా సుమారు పది మంది తాము చేజిక్కించుకున్న దుకాణాలను రోజువారీ అద్దెకు ఇచ్చి జేబులు నింపుకుంటున్నారు. ఈ విషయం జీవీఎంసీ అధికారులకు తెలిసినప్పటికీ చర్యలు తీసుకోకపోవడం అనేక అనుమానాలకు తావిస్తోంది.



పూర్ణామార్కెట్‌లోని దుకాణాలు

పూర్ణామార్కెట్‌లో దుకాణాలను నాలుగు కేటగిరీలుగా విభజించారు. వాటితోపాటు మార్కెట్ లోపల ఖాళీ స్థలాల్లో గ్యారేజీ దుకాణాల పేరుతో మరికొన్ని ఏర్పాటుచేశారు. ఇలా మార్కెట్ లోపల అన్నిరకాల దుకాణాలూ కలిపి 430 వరకూ ఉన్నాయి. వీటిని జీవీఎంసీ అధికారులు చాలాకాలం కిందట వ్యాపారులకు కేటాయించారు. మార్కెట్‌లో అన్ని రకాల వస్తువులు అందుబాటులో ఉండాలనే ఉద్దేశంతో కూరగాయలు, హోల్‌సేల్ పండ్ల దుకాణాలు, మసాలా, కిరాణా, డ్రైఫూట్స్, పూజా సామగ్రి వంటి వ్యాపారాలకు ఇచ్చారు. కాలక్రమంలో హోల్‌సేల్ పండ్ల మార్కెట్ వేరొకచోటకు తరలిపోవడంతో పూర్ణామార్కెట్‌లోని దుకాణాలను ఖాళీ చేసి జీవీఎంసీకి అప్పగించేశారు. ఆ దుకాణాలను జీవీఎంసీ అధికారులను ప్రసన్నం చేసుకుని అప్పటికే మార్కెట్‌లో దుకాణాలు కలిగి ఉన్న కొందరు బినామీ పేర్లతో కైవసం చేసుకున్నారు. అలాగే మార్కెట్‌లో ఎవరైనా వ్యాపారం మానేసినట్టయితే ఆ దుకాణాన్ని జీవీఎంసీకి అప్పగించాల్సి ఉన్నప్పటికీ నాయకులుగా చలామణి అయినవారు, రాజకీయ నేతల వెంట తిరుగుతూ దందాలు చేసేవారు దౌర్జన్యంగా వాటిని బినామీల పేర్లతో చేజిక్కించుకున్నారు. ఇలా మార్కెట్‌లో సుమారు 80 దుకాణాలు పది మంది చేతిలో బినామీ పేర్లతో ఉన్నట్టు వ్యాపారులే చెబుతున్నారు. ఆయా దుకాణాలకు జీవీఎంసీకి రోజుకు రూ.25 నుంచి రూ.35 ఆశీల్ చెల్లిస్తూ, ఇతర వ్యాపారులకు రూ.200 నుంచి రూ.300 అద్దెకు ఇచ్చుకుంటున్నారు. ఇలా బినామీలు ఒక్కో దుకాణం నుంచి నెలకు రూ.ఆరు వేల నుంచి తొమ్మిది వేల వరకు ఆదాయం పొందుతున్నారు.

పూర్ణామార్కెట్ ప్రహరీని ఆనుకుని మెయిన్‌రోడ్డు వైపు వాటర్ ట్యాంకు ఉండేది. ఆ ట్యాంకు నిరుపయోగంగా ఉండడంతో ఆ ప్రాంతంలో రెండు అగరవత్తుల దుకాణాలకు జీవీఎంసీ అధికారులు అనుమతి ఇచ్చారు. దీనిని గుర్తించి మార్కెట్‌లో దందా చేసే ఒక దళారీ ఆ రెండు దుకాణాల మధ్యలో ఒక దుకాణం ఏర్పాటుచేసి వేరొకరికి రోజుకు రూ.200కి అద్దెకు ఇచ్చాడు. దీనిపై అగరవత్తుల వ్యాపారులు జీవీఎంసీ అధికారులకు ఫిర్యాదు చేయడంతో అధికారులు ఆ దుకాణం తొలగించాలని ఆదేశించగా...దళారీ పెద్ద హడావిడి చేశాడు. దీంతో అధికారులే వెనక్కి తగ్గి ఆ దుకాణానికి బినామీ పేరుతో ట్రేడ్ లైసెన్స్ కూడా జారీచేసినట్టు మార్కెట్‌లోని వ్యాపారులు చెబుతున్నారు.

అదేవిధంగా జీవీఎంసీ అధికారులు ప్లాస్టిక్ నిషేధంలో భాగంగా ప్రత్యామ్నాయ బ్యాగ్‌లు విక్రయించేందుకు పూర్ణామార్కెట్ మెయిన్ రోడ్డులో ఒక కౌంటర్‌ను ఏర్పాటుచేశారు. కానీ తర్వాత అక్కడ

... మిగతా 6వ పేజీలో


గాజువాక భూ సమస్య పరిష్కారం

ఇనాం భూముల్లో ఆక్రమణలు క్రమబద్ధీకరణ

- మంత్రివర్గం గ్రీన్‌సిగ్నల్
- 301 జీవో ప్రకారం గుర్తించిన ఆక్రమణదారులకు అవకాశం
- 1000 గజాల వరకూ అవకాశం
- సుమారు ఐదు వేల మందికి ప్రయోజనం

విశాఖపట్నం/గాజువాక, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి):

గాజువాకలో అభ్యంతరం లేని ఇనాం భూముల్లో ఆక్రమణదారుల క్రమబద్ధీకరణకు రాష్ట్ర మంత్రివర్గం గురువారం ఆమోదం తెలిపింది. తాజా నిర్ణయంతో సుమారు ఐదు వేల మందికి ప్రయోజనం కలగనున్నది. వెయ్యి గజాల వరకూ రెగ్యులరైజ్ చేసేందుకు అవకాశం ఉంది.



గాజువాక ప్రాంతంలో సుమారు 200 ఎకరాల ఇనాం భూములను దశాబ్దాల కిందట కొందరు కొనుగోలు చేసి ఇళ్లు నిర్మించుకున్నారు. అయితే ఆ భూములపై 1994లో అప్పటి ప్రభుత్వం హౌస్ కమిటీ నియమించింది. దీంతో ఇళ్లు నిర్మించుకున్నవారికి ఇబ్బందులు మొదలయ్యాయి. ఇళ్ల మరమ్మతులు, కొనుగోళ్లు, అమ్మకాలు, కొత్త నిర్మాణాలకు అవకాశం లేకుండా పోయింది. తమ ఆక్రమణలను క్రమబద్ధీకరించాలని అప్పటినుంచి వారు కోరుతూనే ఉన్నారు. అనేక ప్రభుత్వాలు మారాయి. సమస్య పరిష్కారం కాలేదు. రాష్ట్ర విభజన తరువాత అధికారం చేపట్టిన టీడీపీ ప్రభుత్వం 2016లో గాజువాక ఇనాం భూముల సమస్య పరిష్కారానికి 301 జీవో ఇచ్చింది. దీని ప్రకారం ఆక్రమణల క్రమబద్ధీకరణకు దరఖాస్తులు స్వీకరించింది. సుమారు 12 వేల దరఖాస్తులు రాగా, ఐదు వేల దరఖాస్తులను తిరస్కరించారు. మిగిలిన ఏడు వేల మంది దరఖాస్తుదారులకు పట్టాలు ఇచ్చారు. జీవో 301 మేరకు పట్టా ఇచ్చిన రెండేళ్ల తరువాత కన్వేయన్స్ డీడ్‌లు జారీ చేసి హక్కులు కల్పించాల్సి ఉంది. కానీ 2019లో వచ్చిన వైసీపీ ప్రభుత్వం నాలుగేళ్లపాటు కన్వేయన్స్ డీడ్‌లు ఇవ్వలేదు. చివర్లో అంటే 2023లో దరఖాస్తులు పరిశీలించి సుమారు 5,200 మందికి కన్వేయన్స్ డీడ్లు జారీచేసింది. మరో 1,800 మందికి డీడ్లు జారీచేయాల్సి ఉంది. ఇదిలావుండగా 2016లో ఆక్రమణల క్రమబద్ధీకరణపై అవగాహన లేక/సమాచారం

... మిగతా 6వ పేజీలో

టెన్త్ పరీక్షలకు ఏర్పాట్లు

- 28 వేల మంది విద్యార్థులు
- 134 కేంద్రాలు
- ఈనెల పది నుంచి ప్రీ ఫైనల్ పరీక్షలు

విశాఖపట్నం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి):

వచ్చే నెల 17వ తేదీ నుంచి ప్రారంభం కానున్న పదో తరగతి పరీక్షలకు విద్యాశాఖ విస్తృత ఏర్పాట్లు చేస్తోంది. జిల్లాలో ఈ ఏడాది 28 వేల మంది పరీక్షలు రాయనున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు ఏడు వేల మంది, ప్రైవేటు యాజమాన్యంలో చదివే విద్యార్థులు 21 వేలమంది ఉన్నారు. మొత్తం 134 పరీక్ష కేంద్రాలు ఏర్పాటుచేస్తున్నారు. ప్రభుత్వ కళాశాలల్లో డిసెంబరు నెలాఖరుకు సిలబస్ పూర్తిచేసి, జనవరి తొలి వారం నుంచి రివిజన్ చేపట్టి రోజువారీ టెస్టులు నిర్వహిస్తున్నారు. సెలవు దినాల్లో కూడా తరగతులు నిర్వహించడంతోపాటు మధ్యాహ్నభోజనం అందిస్తున్నారు. ఈనెల పదో తేదీ నుంచి ప్రీ ఫైనల్ పరీక్షలు నిర్వహించనున్నారు.

చదువులో వెనుకబడిన విద్యార్థులపై ఫోకస్

- ఎన్.ప్రేమ్‌కుమార్, జిల్లా విద్యాశాఖాధికారి

పదో తరగతిలో శతశాతం ఉత్తీర్ణత లక్ష్యంగా పెట్టుకున్నాం.ఫార్మెటివ్-1 పరీక్షలో వచ్చిన మార్కుల ఆధారంగా విద్యార్థులను గ్రేడ్లుగా విభజించాం. చదువులో బాగా వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేకంగా దృష్టిపెట్టాం. ప్రతి విద్యార్థి మంచి ఫలితాలు సాధించేలా సన్నద్ధం చేస్తున్నాం.

ప్రైవేటు కళాశాల బరితెగింపు

- అనుమతి లేని భవనంలో తరగతులు
- ఒకేషనల్‌కు పర్మిషన్ తీసుకుని నర్సింగ్ కోర్సులు నిర్వహణ
- షీలానగర్‌లోని విజయకృష్ణ నర్సింగ్ కళాశాలతో ఒప్పందం
- ఫీజు కింద రూ.లక్ష నుంచి రూ.లక్షన్నర వసూలు
- టెన్త్ సర్టిఫికెట్లు వెనక్కి ఇచ్చేందుకు కూడా డబ్బులు డిమాండ్
- విద్యార్థుల ఫిర్యాదుతో ఇంటర్‌బోర్డు అధికారుల తనిఖీలు
- మూడుసార్లు నోటీసులు జారీ చేసిన ఆర్ఐవో
- పట్టించుకోని యాజమాన్యం
- జిల్లా కలెక్టర్, పోలీస్ కమిషనర్ దృష్టికి వ్యవహారం



విశాఖ ఒకేషనల్ జూనియర్ కళాశాల

మద్దిలపాలెం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి)

విశాఖ జూనియర్ కళాశాల (ఒకేషనల్) నిర్వాహకులు బరితెగించారు. ఇంటర్ బోర్డు నిబంధనలను తుంగలో తొక్కి అడ్డగోలుగా వ్యవహరిస్తున్నారు. అధికారుల ఆదేశాలను కూడా బేఖాతరు చేస్తున్నారు. వివరాలిలా ఉన్నాయి.

డాబాగార్డెన్స్ ప్రాంతంలో రెండో పట్టణ పోలీస్ స్టేషన్ సమీపాన విశాఖ జూనియర్ కళాశాల (ఒకేషనల్) ఉంది. అయితే కళాశాల నిర్వాహకులు ఇంటర్, ఒకేషనల్ తరగతుల నిర్వహణకు అనుమతి పొంది నర్సింగ్ కోర్సులు నిర్వహిస్తున్నారు. ఈ మేరకు షీలానగర్‌లోని విజయకృష్ణ నర్సింగ్ కళాశాలతో

... మిగతా 6వ పేజీలో

ప్రభుత్వ భూముల పరిరక్షణకు పటిష్ఠ చర్యలు

- భీమిలి రెవెన్యూ డివిజన్ అధికారులకు కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ ఆదేశం



సమావేశంలో కలెక్టర్ హరేంధిర ప్రసాద్, జేసీ మయూర్ అశోక్

విశాఖపట్నం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి)

ప్రభుత్వ భూముల పరిరక్షణకు పటిష్ఠ చర్యలు చేపట్టాలని రెవెన్యూ అధికారులను జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో భీమిలి డివిజన్ రెవెన్యూ అధికారులతో నిర్వహించిన సమావేశంలో జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్‌తో కలిసి ఆయన వివిధ అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అన్యాక్రాంతమైన ప్రభుత్వ భూములను గుర్తించి తగిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులు, వినతులపై తక్షణమే స్పందించాలన్నారు. ఫ్రీహోల్డ్ భూముల రీ వెరిఫికేషన్,

... మిగతా 6వ పేజీలో

ఉక్కు ఉద్యోగులకు అధిక పెన్షన్

- సమస్య పరిష్కారానికి ఢిల్లీలో ఎంపీ ఎం.శ్రీభరత్, విశాఖలో ఎమ్మెల్యే పల్లా కృషి
- ప్రశంసలతో ముంచెత్తిన ఉద్యోగ సంఘాలు

విశాఖపట్నం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి):

విశాఖపట్నం స్టీల్ ప్లాంటు సమస్యలను ఒక్కొక్కటిగా కూటమి నాయకులు పరిష్కరిస్తున్నారు. ప్లాంటును పూర్తి సామర్థ్యంతో నడపడానికి కేంద్రం ఇటీవల రూ.11,440 కోట్ల సాయం చేయగా, తాజాగా ఐరన్‌ఓర్ సరఫరాకు ఎన్ఎండీసీ బుధవారం ఒప్పందం చేసింది. ఇపుడు గత 15 నెలలుగా స్టీల్‌ప్లాంటు ఉద్యోగులు ఎదుర్కొంటున్న 'అధిక పెన్షన్' సమస్యను ఢిల్లీలో విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్, విశాఖలో గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావులు కలిసి పరిష్కరించారు. దీనివల్ల రిటైరైన, ప్రస్తుతం పనిచేస్తున్న ఐదు వేల మంది ఉద్యోగులకు ప్రయోజనం కలుగుతుంది. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం అధిక పెన్షన్ల కోసం స్థానిక ఎంప్లాయీస్ ప్రావిడెంట్ ఫండ్ సంస్థ (ఈపీఎఫ్‌ఓ) ఫీల్డ్ ఆఫీస్ జారీచేసిన నోటీసులకు స్పందించి ప్లాంటులో అధిక పెన్షన్ కోరుకున్నవారు 15 నెలల క్రితం రూ.410 కోట్లు డిపాజిట్ చేశారు. అప్పటి నుంచి అధిక పెన్షన్ల కోసం ఎదురుచూస్తున్నారు. వందలాది మంది ఎప్పటికప్పుడు విజ్ఞప్తులు చేస్తున్నా ఎటువంటి



ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుకు కృతజ్ఞతలు చెబుతున్న ఉక్కు ఉద్యోగులు

... మిగతా 6వ పేజీలో



పొట్నూరులో శిథిల కల్వర్టుతో అవస్థలు

- గ్రామంలో ఏళ్ల తరబడి సమస్య
- రాకపోకలకు స్థానికుల ఇబ్బందులు

పద్మనాభం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పొట్నూరు గ్రామానికి వెళ్లే మార్గంలో గెడ్డపై నిర్మించిన కల్వర్టు పూర్తిగా శిథిలం కావడంతో వాహనదారులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. కల్వర్టు శిథిలావస్థకు చేరుకొని రెండేళ్లకు పైగా అవుతున్నా, అధికారులు నూతన కల్వర్టు నిర్మాణానికి చర్యలు తీసుకోవడం లేదు. దీంతో శిథిల కల్వర్టు రాను రాను కుంగిపోతోంది. ఎప్పుడు ఇది కూలిపోతుందోనని ప్రజలు, వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. రోడ్లు, భవనాల శాఖ పరిధిలో ఉన్న రోడ్డులోని ఈ కల్వర్టు రెడ్డిపల్లి నుంచి పొట్నూరు గ్రామానికి వెళ్లే మార్గంలో ఊరు ముఖద్వారం వద్ద ఉంది. పదేళ్ల క్రితం నిర్మాణం చేపట్టడంతో కల్వర్టు పూర్తిగా శిథిల దశకు చేరుకొని ఒకవైపునకు కుంగిపోయింది. మరో భాగం విరిగిపోయింది. కల్వర్టు పైభాగం కూడా గోతులు పడి, బీటలు వారి ఉండడంతో వాహనదారులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. కొందరు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఏమాత్రం అప్రమత్తంగా లేకపోయినా గెడ్డలో పడే ప్రమాదం ఉంది. పైపులు కూడా పూడికపోవడంతో వర్షా కాలంలో నీరు దీని మీదుగా ప్రవహించి రాకపోకలకు విఘాతం కలుగుతోంది. గతంలో ఈ ప్రవాహంలో పలువురు కొట్టుకుపోయిన సంఘటనలు కూడా ఉన్నాయి. ఈ గ్రామంతో పాటు విజయనగరం జిల్లా జామిలోని పలు గ్రామాలకు అనుసంధానంగా ఉన్న ఈ రోడ్డు కల్వర్టు ఇంత ఘోరంగా దెబ్బతినడం వల్ల ప్రజలు అనేక అగచాట్లకు గురవుతున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి నూతన కల్వర్టు నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈ విషయమై


గ్రామంలో శిథిలావస్థలో ఉన్న కల్వర్టు

ఆర్‌అండ్‌బీ డీఈఈ గంగరాజును వివరణ కోరగా నిధుల మంజూరు కోసం ప్రతిపాదనలు పంపామన్నారు. ఎన్నికల కోడ్ అనంతరం నిధులు మంజూరైతే పనులు చేపడతామని ఆయన తెలిపారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ఆనందపురం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్ నిర్వహణ పనుల దృష్ట్యా శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా నిలిపివేయనున్నట్టు ఏఈ సురేశ్ కుమార్ తెలిపారు. గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. భీమన్నదొరపాలెం, రామవరం, జీఎస్ అగ్రహారం, కణమాం, మామిడిలోవ, ఎన్‌జీఆర్‌పురం పంచాయతీలకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించాలని కోరారు.

మధురవాడ : మధురవాడ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని 11 కేవీ హిల్ వన్ ఫీడర్ నిర్వహణ పనుల వల్ల ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 వరకు సరఫరా నిలిపివేయనున్నట్టు జోన్-3 డీఈ పోలాకి శ్రీనివాసరావు తెలిపారు. అయోధ్యనగర్, ఆర్టీసీ కాలనీ, మానం ఆంజనేయనగర్, నగరంపాలెం ప్రాంతాలకు సరఫరా ఉండదన్నారు.


అద్దంలా ఉన్న విజయనగరం-చిన్నాపురం జంక్షన్ రహదారి

అద్దంలా చిన్నాపురం జంక్షన్-విజయనగరం రోడ్డు

పద్మనాభం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : చిన్నాపురం జంక్షన్ - విజయనగరం రోడ్డుకు ఎట్టకేలకు మోక్షం కలిగింది. గత ఐదేళ్లు ఈ రోడ్డు దుస్థితి గురించి వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత రోడ్ల మరమ్మతుకు ప్రాధాన్యం ఇవ్వడంతో ఈ రోడ్డుకు పూర్తిస్థాయిలో మరమ్మతులు చేపట్టారు. గోతులు పూడ్చివేసి, బీటీ వేయడంతో రోడ్డు అద్దంలా మెరిసిపోతోంది. దీంతో వాహనదారులు రాకపోకలు సాఫీగా సాగిస్తున్నారు.


మరమ్మతుకు ముందు రోడ్డు దుస్థితి(ఫైల్‌ఫొటో)

నేటి నుంచి ఉపాలయాల్లో వార్షిక తిరుకల్యాణోత్సవాలు

సింహాచలం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామి ఉపాలయాలు త్రిపురాంతకస్వామి, కొండదిగువ వేంకటేశ్వరస్వామి, మాధవధారలోని వేణుగోపాలస్వామి ఆలయాల్లో శుక్రవారం నుంచి వార్షిక తిరుకల్యాణోత్సవాలు జరగనున్నట్టు ఈఓ త్రినాథరావు తెలిపారు. గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఏటా మాఘమాస శుక్లపక్ష దశమి నాటి అంకురార్పణ నుంచి పూర్ణిమ నాటి అవబృదోత్సవం వరకు ఉపాలయాల్లో వార్షిక తిరు కల్యాణ మహోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ. ఈమేరకు మాఘమాస శుక్లపక్ష ఏకాదశి (భీష్మఏకాదశి) పురస్కరించుకుని ఈనెల 8న రాత్రి 9.30 గంటలకు సింహగిరి మాడవీధుల్లో తిరువీధి తరువాత శైవాగమ శాస్త్ర విధానంలో త్రిపురాంతకస్వామి కల్యాణం జరుగుతుందన్నారు. అదే రోజు సాయంత్రం 4 గంటలకు కొండదిగువ మాడవీధుల్లో తిరువీధి, రాత్రి 7 గంటలకు వేంకటేశ్వరస్వామి వార్షిక తిరు కల్యాణం నిర్వహించనున్నట్టు చెప్పారు. అలాగే మాధవధారలో రుక్మిణీ సమేత వేణుగోపాలస్వామి వార్షిక తిరు కల్యాణోత్సవం రాత్రి 7 గంటలకు, రాత్రి 9 గంటలకు గ్రామ తిరువీధి జరుగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.



అప్పన్నకు స్వర్ణ పుష్పార్చన

సింహాచలం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామికి ఆర్జిత సేవల్లో భాగంగా స్వర్ణ పుష్పార్చన గురువారం వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. ఆలయ పద్మనిధి నుంచి పసిడి సంపెంగలు తీసి భక్తులతో స్పృశింపజేసి బేడామండప ప్రదక్షిణ చేశారు. భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం నారసింహ అష్టోత్తర శతనామావళి పఠిస్తూ అన్ని నామాలకు పసిడి సంపెంగలతో అర్చనలు చేశారు. స్వామివారికి మంత్రపుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, ప్రసాదాలను అందజేశారు.

కప్ప స్తంభం ఆదాయం రూ. 6.7 లక్షలు

సింహాచలం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామి ఖజానాకు కప్ప స్తంభం ఆలింగనాల ద్వారా రూ. 6.7 లక్షల ఆదాయం సమకూరింది. గత నెలలో కప్ప స్తంభాన్ని 27188 మంది భక్తులు ఆలింగనం చేసుకోవడం ద్వారా ఈ మొత్తం లభించింది. కాగా గతంలో మాదిరిగా కప్ప స్తంభం ఆలింగనాల టికెటుపై లడ్డూ ప్రసాదం ఉచితంగా అందజేయాలని భక్తులు కోరుతున్నారు.

రైతులకు అందుబాటులో యూరియా, పొటాష్

పద్మనాభం రూరల్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) :మండలంలోని రైతు సేవా కేంద్రాల్లో యూరియా, పొటాష్ అందుబాటులో ఉన్నాయని ఏఓ చలం తెలిపారు. గురువారం ఆయన ఇక్కడి విలేకరులతో మాట్లాడారు. ప్రస్తుత రబీ సీజన్‌లో 1400 ఎకరాల్లో వివిధ రకాల పంటలు, 9500 ఎకరాల్లో ఉద్యానవన పంటలు సాగవుతున్నాయని చెప్పారు. వీటికి అవసరమైన యూరియా, పొటాష్ రైతు సేవా కేంద్రాల్లో ఉన్నాయన్నారు.మద్ది కేంద్రంలో 6 టన్నుల యూరియా, 6 టన్నుల పొటాష్, రేవిడిలో 6 టన్నుల పొటాష్, పాండ్రంగిలో 12 బస్తాల యూరియా, 6 టన్నుల పొటాష్ అందుబాటులో ఉన్నట్టు తెలిపారు.

మెట్‌ల్యాబ్‌తో పూర్తిస్థాయి సమాచార సేకరణ

సాగర్‌నగర్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : మెట్‌ల్యాబ్‌లోని వివిధ సాధనాలను ఉపయోగించి సమాచార విశ్లేషణ లోతుగా తెలుసుకోవచ్చునని గీతం సీఎస్‌ఈ విభాగం డీన్ ప్రొఫెసర్ ఎస్. అరుణ్‌కుమార్ తెలిపారు. గురువారం గీతం వర్సిటీలో మెట్‌ల్యాబ్‌ను కృత్రిమ మేధ, మిషన్ లెర్నింగ్‌లో ఏవిధంగా ఉపయోగించవచ్చు అన్న అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా గీతం ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ సెంటర్ డైరెక్టర్ జీవీఆర్ శర్మ మాట్లాడుతూ అధ్యాపకులు సాంకేతిక ప్రగతిపై, నూతన ఆవిష్కరణలపై దృష్టిసారించాలన్నారు. పరిశోధనల ద్వారా దేశ ప్రగతిలో పాలుపంచుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో మేథ్ వర్క్స్ సంస్థ శిక్షణాధికారి ఎల్లా జాన్, తదితరులు పాల్గొన్నారు.

వాంబేకాలనీలో ఉచిత వైద్య శిబిరం


రోగులకు మందులు అందిస్తున్న వెంకటరావు

మధురవాడ, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ ఏడో వార్డు మధురవాడ వాంబే కాలనీలో బీజేపీ నాయకులు గురువారం వైద్య శిబిరం ఏర్పాటు చేశారు.వైద్యులు వంద మంది రోగులకు పరీక్షలు చేసి, మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యనిర్వాహక కార్యదర్శి పిళ్లా వెంకటరావు, బీజేపీ నాయకులు శివకుమార్, వై .అప్పారావు, సుబ్బరాజు, పి.ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



వలంటీర్లకు మెటీరియల్‌ను అందిస్తున్న ఎంపీడీఓ జానకి

'ఉల్లాస్' వలంటీర్లకు శిక్షణ

ఆనందపురం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వెలుగు కార్యాలయంలో ఉల్లాస్ కార్యక్రమానికి సంబంధించి వలంటీర్లకు గురువారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎంపీడీవో జానకి మాట్లాడుతూ వలంటీర్లు గ్రామాల్లోని నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలన్నారు. ప్రతి గ్రామంలోనూ రాత్రి 7 నుంచి 9 వరకూ తరగతులు నిర్వహించాలని చెప్పారు. అనంతరం తరగతులు ఏవిధంగా నిర్వహించాలో తెలిపి, అభ్యసనా సామగ్రిని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వెలుగు ఏపీఎం ఆదినారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికతో చదివితేనే ఉత్తమ ఫలితాలు


బాలికలకు బహుమతులు అందిస్తున్న ఏపీసీ చంద్రశేఖర్

భీమునిపట్నం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు శాస్త్ర విజ్ఞానాన్ని అన్వయిస్తూ వినూత్నమైన ఆలోచనలతో ఉన్నతంగా ఎదగాలని సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్టు కో ఆర్డినేటర్ జె. చంద్రశేఖర్ సూచించారు. గురువారం గొల్లలపాలెం కేజీబీవీలో జరిగిన పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యార్థి దశ చాలా కీలకమైనదని, ప్రణాళికాబద్ధంగా చదువుకుని లక్ష్యాలను చేరుకోవాలన్నారు. జిల్లా జీసీడీఓ కలీషా బేగం మాట్లాడుతూ పరీక్షలకు పట్టుదలతో చదివి, మంచి మార్కులు సాధించాలని ఆకాంక్షించారు.అనంతరం విద్యార్థినులు పలు సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో విద్యాలయం విద్యా కమిటీ ఛైర్మన్ చందవరపు కుమార్, ప్రిన్సిపాల్ కుమారి గంగ, తదితరులు పాల్గొన్నారు.


చికిడి గ్రామంలో స్వామివారి కల్యాణం చేస్తున్న అర్చకులు

ఒడిశాలో వైభవంగా అప్పన్న శోభాయాత్ర

సింహాచలం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : ఒడిశాలోని పలు ప్రాంతాల్లో భక్తుల సందర్శనార్థం తీసుకువెళ్లిన ప్రచార రథం గురువారం సాయంత్రం సింహాచలానికి తిరిగి పయనమైంది. స్వామివారి భక్తుడు లక్ష్మీకాంత్ నాయక్ దాసుడు పర్యవేక్షణలో తొలుత పట్టుపురంలో ఈ నెల 3న ఉదయం నారసింహం హోమం, సాయంత్రం కల్యాణోత్సవం ఆలయ ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. తరువాత విష్ణుచక్రపురంలో శాంతి కల్యాణం, నారసింహ హోమం వైభవంగా జరిపారు. గురువారం చికిడి గ్రామంలో శాంతి కల్యాణం జరిపిన తరువాత చేపట్టిన శోభాయాత్రలో ఒడిశా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. భక్తుల హరినామస్మరణతో పురవీధులు మార్మోగాయి.

టెన్త్ విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ


విద్యార్థులతో స్టడీ మెటీరియల్ అందించిన దాతలు

ఆనందపురం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గొట్టిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులకు స్థానిక శ్రీసత్యసాయి ఇంటిగ్రేటెడ్ సేవా మందిరంలో గురువారం స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. వేములవలస పంచాయతీ ఉప సర్పంచ్ కోరాడ నవీన్ జ్ఞానేశ్వర్ తన సొంత నిధులతో 54 మంది విద్యార్థులకు వీటిని అందజేశారు. గొట్టిపల్లి భజన మండలి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం బి. అప్పారావు, సత్యసాయి ఆదర్శ గ్రామం కో-ఆర్డినేటర్ డబ్బీరు విజయ్‌కుమార్, కన్వీనర్ కోరాడ తమ్మునాయుడు, బాల వికాస్ కో-ఆర్డినేటర్ సంతోష్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.


మ్యూజియంలో రంగులు వెలసి కళా విహీనంగా కనిపిస్తున్న విగ్రహాలు

అధ్వానంగా అల్లూరి మ్యూజియం

మధురవాడ, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : స్థానిక శిల్పారామంలో పదేళ్ల క్రితం ఏర్పాటు చేసిన అల్లూరి సీతారామరాజు మ్యూజియం నిర్వహణ లోపం వల్ల వెలవెలపోతోంది.అల్లూరి జీవిత చరిత్ర గురించి నేటి తరానికి తెలియజేయాలన్న ఉద్దేశంతో ఈ మ్యూజియం ఏర్పాటు చేశారు.అల్లూరి జననం నుంచి మరణం వరకు ఇక్కడ అనేక బొమ్మలను పొందుపరిచారు. బ్రిటీష్ వారిపై అల్లూరి పోరాట పటిమను తెలిపేలా వీటిని అమర్చారు. అయితే నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో ఏర్పాటు చేసిన నాలుగేళ్లకే మ్యూజియం మూలకు చేసింది. కొన్ని బొమ్మలకు చేతులు, కాళ్లు విరిగిపోయాయి. మరికొన్ని రంగులు వెలసి కళా విహీనంగా కనిపిస్తున్నాయి. బొమ్మలకు వేసిన దుస్తులు కూడా చిరిగిపోయాయి. అధికారులు తక్షణమే స్పందించి మ్యూజియం నిర్వహణపై దృష్టిసారించాలని పలువురు కోరుతున్నారు.

గాజువాక భూ సమస్య పరిష్కారం

... 5వ పేజీ తరువాయి

తెలియక/వివిధ రకాల వివాదాలతో సుమారు మూడువేల మందికిపైగా దరఖాస్తు చేసుకోలేదు. దాంతో వారంతా ఆందోళన వ్యక్తం చేయడంతో కొత్తగా వచ్చిన కూటమి ప్రభుత్వం... సమస్య పరిష్కారంపై దృష్టిసారించింది. వారం క్రితం రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్‌తో జిల్లా ఎమ్మెల్యేలు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా గాజువాక ఇనాం భూముల ఆక్రమణల క్రమబద్ధీకరణ అంశం చర్చకు వచ్చింది. ఆక్రమణల క్రమబద్ధీకరణకు అనుమతి ఇస్తామని ఇచ్చిన హామీ మేరకు గురువారం మంత్రివర్గం చర్చించి ఆమోదించింది. దీనికి సంబంధించి త్వరలో పూర్తి విధి విధానాలు జారీచేస్తారు. గతంలో పట్టాలు ఇచ్చి కన్వేయన్స్ డీడ్స్ కోసం ఎదురుచూస్తున్న 1800 మందితో పాటు పలు కారణాలతో దరఖాస్తు చేయని సుమారు మూడు వేల మందికి అవకాశం ఇవ్వనున్నారు.

ఆవేదనతో ఉన్న ప్రజలకు ఊరట

- పల్లా శ్రీనివాసరావు, ఎమ్మెల్యే, గాజువాక

గాజువాకలో ఏళ్ల క్రితం ఇళ్లు నిర్మించుకున్న కుటుంబాల ఆవేదనను కూటమి ప్రభుత్వం గుర్తించింది. ఆక్రమణల క్రమబద్ధీకరణకు అవకాశం కల్పించడంతో వారికి ఊరట లభించింది. సమస్య పరిష్కారానికి మూడు దశాబ్దాల నుంచి ప్రజలు పోరాడుతున్నారు. గతంలో జీవో 301 ప్రకారం 5,200 మందికి సీఎం చంద్రబాబు పట్టాలు ఇప్పిస్తే వైసీపీ ప్రభుత్వం వారికి హక్కులు కల్పించలేదు. తిరిగి చంద్రబాబు సీఎంగా బాధ్యతలు తీసుకున్న తరువాత గాజువాక ఆక్రమణలపై స్పందించడం గొప్ప విషయం. గాజువాకలో ఐదు వేల మంది మంది ఆక్రమణదారుల తరఫున కూటమి ప్రభుత్వానికి ధన్యవాదాలు.

విద్యార్థులకు వస్తు సామగ్రి కిట్లు పంపిణీ

భీమునిపట్నం రూరల్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చిప్పాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినులకు నాంది ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం క్రీడా కిట్లు అందించారు. పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో 86 మంది విద్యార్థులకు దాతలు వీటిని ఇచ్చారు. ఒక్కో కిట్‌లో ఒక కోటు, నోట్ బుక్స్, స్పోర్ట్సు షూ, శానిటరీ నాప్కిన్స్, పెన్సిళ్లు, పెన్నులు ఉన్నాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం ఎంవీటీ రత్నం, ఉపాధ్యాయులు రేఖ అప్పారావు, సునీల్‌కుమార్, సత్యవతి, ఆర్. త్రివేణి, కె. అనురాధ, నాంది ఫౌండేషన్ ఇన్‌స్ట్రక్టర్ వెంపాడ రమాదేవి, మౌనిక, పీఈటీ రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరా స్తంభం పునరుద్ధరణ

భీమునిపట్నం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : తిమ్మాపురం జంక్షన్‌లో నేలకొరిగిన సీసీ కెమెరా స్తంభాన్ని అధికారులు గురువారం పునరుద్ధరించారు. వారం రోజుల క్రితం సిసి కెమెరా స్తంభాన్ని గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో నేలకొరిగిన విషయం తెలిసిందే. బీచ్‌రోడ్‌లో శాంతిభద్రతల దృష్ట్యా పోలీసులు తక్షణమే ఈ స్తంభాన్ని పునరుద్ధరించారు.

గృహ నిర్మాణాలకు 814 దరఖాస్తులు

పద్మనాభం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం సొంత స్థలాలు ఉన్న వారికి ఎన్టీఆర్ గృహ పథకం కింద ఇళ్లు మంజూరు చేస్తామని ప్రకటించడంతో 814 మంది దరఖాస్తు చేసుకున్నారు. సచివాలయాల ద్వారా ఈ దరఖాస్తులను స్వీకరించారు. దరఖాస్తులను పరిశీలన చేసి లబ్ధిదారులను ఎంపిక చేస్తారు. ఎంపికైన వారికి తమ సొంత స్థలాల్లో ఇళ్ల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం రూ.1.50 లక్షలు, రాష్ట్ర ప్రభుత్వం రూ. లక్ష ఆర్థిక సాయం అందిస్తాయి.

ప్రైవేటు కళాశాల బరితెగింపు

... 5వ పేజీ తరువాయి

ఒప్పందం కుదుర్చుకున్నారు. ఇక్కడ తరగతులు చెబుతూ...విజయకృష్ణ కాలేజీ పేరుతో విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇస్తున్నారు. ఇందుకుగాను ఒక్కో విద్యార్థి నుంచి రూ.లక్ష నుంచి రూ.లక్షన్నర వరకూ వసూలు చేస్తున్నారు. అంతేకాకుండా కోర్సులు పూర్తిచేసిన విద్యార్థులకు పదవ, ఇంటర్ సర్టిఫికెట్లు తిరిగి ఇవ్వడానికి మరో రూ.10 వేలు నుంచి రూ.20 వేలు వరకు డిమాండ్ చేస్తున్నారు. ఈ ఏడాది నర్సింగ్ కోర్సు పూర్తిచేసిన విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వడానికి కళాశాల యాజమాన్యం డబ్బులు డిమాండ్ చేసింది. దీంతో విద్యార్థులు ఇంటర్మీడియట్ బోర్డు ప్రాంతీయ అధికారి (ఆర్ఐవో) మురళీధర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు బుధవారం తనిఖీకి వెళ్లిన బోర్డు అధికారులు కళాశాల నిర్వహణ చూసి ఖంగుతిన్నారు. అనుమతి పొందిన చిరునామాలో కాకుండా వేరే భవనంలో కళాశాల నిర్వహిస్తున్నట్టు, ఒకేషనల్ కళాశాల అనుమతి పొంది నర్సింగ్ కోర్సులు బోధిస్తున్నట్టు గుర్తించారు. మొదట అంతస్థులో షాపింగ్ మాల్, రెండో అంతస్థులో చర్చి ఉండగా...మూడో అంతస్థులో జూనియర్ కళాశాల, ఆపై అంతస్థులో అనధికారికంగా వసతి గృహం నిర్వహిస్తుండడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. అనుమతి లేని భవనంలో కళాశాల, నర్సింగ్ కోర్సులు ఎందుకు నిర్వహిస్తున్నారో తెలపాలని యాజమాన్యానికి ఆర్ఐవో మురళీధర్ నోటీసులు ఇచ్చారు. ఆర్ఐవో నోటీసులకు కళాశాల నిర్వాహకులు స్పందించకపోగా విద్యార్థులకు సర్టిఫికెట్లు కూడా ఇవ్వలేదు. దీంతో ఆర్ఐవో గురువారం మరో రెండు దఫాలు నోటీసులిచ్చారు. వాటికి కూడా స్పందించకపోవడంతో కళాశాలపై చర్యలు తీసుకోవడానికి అనుమతివ్వాలని కోరుతూ ఇంటర్ బోర్డు కమిషనర్‌కు లేఖ రాశారు. ఇదిలావుండగా ఆర్ఐవో ఆదేశించినా సర్టిఫికెట్లు ఇవ్వకపోవడంతో విద్యార్థులు గురువారం జిల్లా కలెక్టర్, పోలీస్ కమిషనర్, రెండో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేయకుండా ఆర్ఐవోను సంప్రతించి కళాశాల సీజ్ చేయాలని సూచించారు. కలెక్టర్ కూడా చర్యలు తీసుకోవాలని ఆర్ఐవోకి ఆదేశించగా పరీక్షల సమయంలో కళాశాల సీజ్ చేస్తే విద్యార్థులు రోడ్డున పడతారని ఆయన వివరించారు.

పరీక్షలు ముగియగానే చర్యలు

- మురళీధర్, ఆర్ఐవో

విశాఖ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో సర్టిఫికెట్లు ఇవ్వడానికి డబ్బులు డిమాండ్ చేస్తున్నట్టు విద్యార్థులు ఫిర్యాదు చేశారు. వారికి ధ్రువపత్రాలు ఇచ్చేయాల్సిందిగా యాజమాన్యాన్ని ఆదేశించినా పట్టించుకోలేదు. దీంతో విద్యార్థులు పోలీస్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. అనుమతి లేని భవనంలో కళాశాల నిర్వహించడమే కాకుండా నర్సింగ్ కోర్సులు నిర్వహిస్తున్నారు. దీనిపై కళాశాల యాజమాన్యానికి నోటీసులిచ్చాం. వారి నుంచి సంతృప్తికరమైన సమాధానం లేనందున చర్యలకు కమిషనర్‌కు లేఖ రాశాం. విద్యార్థుల భవిష్యత్ దృష్ట్యా పరీక్షలు ముగియగానే కళాశాలపై చర్యలు తీసుకుంటాము.

పుంజుకున్న రిజిస్ట్రేషన్లు

... 5వ పేజీ తరువాయి

డాక్యుమెంట్లు దాఖలవుతాయని, దాంతో మంచి ఆదాయం వస్తుందని అధికారులు చెబుతున్నారు.

రూ.వేయి కోట్లు సాధిస్తాం

ప్రభుత్వం విశాఖపట్నం జిల్లాలో రియల్ ఎస్టేట్ లావాదేవీలను బట్టి 2024-25 ఆర్థిక సంవత్సరానికి రూ.1,526 కోట్ల ఆదాయం లక్ష్యంగా ఇచ్చింది. ఎన్నికల సంవత్సరం కావడం, ప్రభుత్వం మారితే విశాఖ కేంద్రంగా పరిపాలనా రాజధాని ఉంటుందా? లేదా? అనే అనుమానాలు ఉండడం వల్ల కొన్ని నెలల పాటు లావాదేవీలు తగ్గిపోయాయి. కొత్త ప్రభుత్వం వచ్చాక...పరిస్థితులపై అవగాహన పెంచుకున్న రియల్ ఎస్టేట్ వ్యాపారులు, ప్రజలు మళ్లీ ఆసక్తి చూపిస్తున్నారు. ప్రతి ఏటా ఫిబ్రవరి, మార్చి నెలల్లో రిజిస్ట్రేషన్లు అధికంగానే ఉంటాయి. ఇప్పటి వరకు రూ.716.59 కోట్లు ఆదాయం వచ్చింది. మార్చి నెలాఖరుకు వేయి కోట్ల మార్కు దాటేస్తాం. జిల్లాలోని మొత్తం తొమ్మిది కార్యాలయాల ఆదాయం పరిశీలిస్తే భీమునిపట్నం, ద్వారకానగర్, గోపాలపట్నం కార్యాలయాలు మాత్రమే అంతకు ముందు ఏడాది కంటే తక్కువ ఆదాయంలో ఉన్నాయి. మిగిలిన ఆరు కార్యాలయాలు ఎక్కువ ఆదాయం సాధించాయి. మొత్తంగా చూసుకుంటే గత ఏడాది జనవరి నెలాఖరుకు ఇప్పటికీ బేరేజు వేసుకుంటే 3.29 శాతం వృద్ధి సాధించాము.



- ఉపేంద్రరావు, జిల్లా రిజిస్ట్రార్

ప్రభుత్వ భూముల పరిరక్షణకు పటిష్ఠ చర్యలు

... 5వ పేజీ తరువాయి

నీటి ప్రవాహ ప్రాంతాల్లో ఆక్రమణలు, యూఎల్‌సీ భూముల పరిరక్షణ, రెవెన్యూ రికార్డుల నిర్వహణ, 22-ఎ డీనోటిఫికేషన్, ఆర్‌వోఆర్ అప్పీళ్లు, కోర్టు కేసులు, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో వచ్చిన అర్జీల పరిష్కారం తదితర అంశాలపై పలు సూచనలు చేశారు. గ్రామ సభల్లో వచ్చిన వినతుల పరిష్కారంపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి బీహెచ్ భవానీశంకర్, భీమిలి ఆర్డీవో సంగీత్‌మాధుర్, ప్రత్యేక ఉప కలెక్టర్లు, తహసీల్దార్లు, సెక్షన్ సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.

పూర్ణామార్కెట్‌లో బినామీ దందా

... 5వ పేజీ తరువాయి

ప్లాస్టిక్ ప్రత్యామ్నాయ బ్యాగ్‌ల విక్రయం నిలిచిపోయింది. మార్కెట్‌లో బినామీ పేర్లతో అనేక దుకాణాలను చేజిక్కించుకున్న ఓ దళారీ ఇటీవల దానిముందుఒకరితో దుకాణం పెట్టించి రోజుకి రూ.200 అద్దె వసూలు చేస్తున్నారు. బినామీ పేర్లతో దుకాణాలను కొంతమంది చేజిక్కించుకుంటున్న విషయం జీవీఎంసీ జోన్-4 అధికారులకు తెలిసినప్పటికీ చర్యలు తీసుకోవడానికి మాత్రం ముందుకురావడం లేదని వ్యాపారులు వాపోతున్నారు.అధికారులకు వాటాలు అందుతుండడంతో ఏమీ తెలియనట్టు వ్యవహరిస్తున్నారని అనుమానం వ్యక్తంచేస్తున్నారు. మార్కెట్‌లో దందా చేస్తున్న మరొకరు ఐదు దుకాణాలను చేతిలోపెట్టుకుని అద్దెలకు ఇస్తున్నాడని, పైగా మార్కెట్‌లో ఉన్న సులభ్ కాంప్లెక్స్ నిర్వహణను ఒక మహిళకు అప్పగించి, ఆమె నుంచి నెలకు రూ.ఐదు వేలు కమీషన్ తీసుకుంటున్నట్టు వ్యాపారులు ఆరోపిస్తున్నారు. ఆశీల్ వసూలు నుంచి, దుకాణాలను బినామీ పేర్లతో గుప్పిట్లో పెట్టుకోవడం వరకూ అనేక ఉల్లంఘనలు ఉన్నాయి. పూర్ణామార్కెట్ ప్రక్షాళనకు జీవీఎంసీ ఉన్నతాధికారులు ఇప్పటికైనా నడుంబిగిస్తారో లేదో చూడాలి.

ఉక్కు ఉద్యోగులకు అధిక పెన్షన్

... 5వ పేజీ తరువాయి

ఫలితం లేకపోవడంతో ఉద్యోగ సంఘాల నాయకులు విశాఖ ఎంపీ శ్రీభరత్‌ను, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావును కలిసి సమస్య వివరించారు. దీనిపై ఎంపీ శ్రీభరత్...కేంద్ర కార్మిక శాఖా మంత్రి మనసుఖ్ మాండవీయను కలిసి పెన్షన్లు విడుదల చేయాలని కోరారు. ఆలస్యానికి కారణాలు తెలుసుకొని ఢిల్లీలో ఈపీఎఫ్ఓ కార్యాలయంపై ఒత్తిడి పెట్టారు. ఇక్కడ స్టీల్ ప్లాంటు రీజనల్ కార్యాలయంలో పల్లా శ్రీనివాసరావు తరచూ సమీక్షలు నిర్వహించి పెన్షన్లు మంజూరుకు యత్నించారు. వీరిద్దరి కృషి ఫలితంగా అధిక పెన్షన్లకు అడ్డంకులన్నీ తొలగిపోయాయి. దీంతో ఐదు వేల మందికి ప్రయోజనం కలిగింది. దీంతో విశాఖ ఉక్కు ఉద్యోగ వర్గాలన్నీ ఎంపీ శ్రీభరత్‌కు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావకు కృతజ్ఞతలు తెలిపారు. ప్లాంటుకు సంబంధించిన సమస్యలపై సకాలంలో స్పందించి పరిష్కరిస్తున్నందుకు ధన్యవాదాలు తెలిపారు.

నేడు ప్రసన్నగిరి ప్రదక్షిణ

అక్కిరెడ్డిపాలెం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): బీహెచ్‌పీవీ ప్రసన్నగిరిపై గల శ్రీ వెంకటేశ్వర వినాయక స్వామి దేవస్థానం వార్షికోత్సవాల సందర్భంగా శుక్రవారం గిరి ప్రదక్షిణ నిర్వహించనున్నారు. ఉదయం 6.30 గంటలకు ప్రసన్నగిరి నుంచి బయలుదేరి మిందిరహదారి, అప్పన్న కాలనీ మీదుగా తిరిగి జాతీయ రహదారికి చేరుకోవడంతో ప్రదక్షిణ పూర్తవుతుంది. 108 కలశాలతో మహిళలు, కోలాట బృందాలు, భక్తులు పాల్గొంటారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

అగనంపూడి, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): కేబీఆర్ 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్వహణ పనుల నిమిత్తం శుక్రవారం విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్టు ఈపీడీసీఎల్ అగనంపూడి సెక్షన్ ఏఈ లక్ష్మణ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు అగనంపూడి, ఉక్కు నిర్వాసిత కాలనీల, పాత అగనంపూడి, శ్రీనివాసనగర్, శాంతినగర్, అన్నపూర్ణానగర్, గల్లవానిపాలెం,శనివాడ, జాబిలిహిల్స్ దువ్వాడ, లక్కరాజుపాలెం, యాతపాలెం, శివాజీనగర్, గ్రామాల్లో విద్యుత్ సరఫరాను అంతరాయం ఏర్పడుతుందని వివరించారు. వినియోగదారులంతా గమనించి తమకు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

నేడు ఆలయ వార్షికోత్సవం

అగనంపూడి, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక షిర్డీసాయి ఆలయం 25వ వార్షికోత్సవాన్ని శుక్రవారం నిర్వహించనున్నట్టు షిర్డీసాయి సేవా సమితి అధ్యక్షుడు కొయ్య వెంకటరమణారెడ్డి తెలిపారు. వేడుకలను పుర్కరించుకొని స్వామి వారిని ప్రత్యేక వస్త్రాలు, పుష్పాలతో అలంకరించి అనంతరం పూజా కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. హోమంతో పాటు పూర్ణాహుతి, ఆశీర్వచనం వంటి పూజలను జరపనున్నట్లు చెప్పారు. మధ్యాహ్నం అన్న సమారాధన, పలు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశామన్నారు.

గుజరాత్ వ్యాపారవేత్తకు డైరీ అప్పగింత

కూర్మన్నపాలెం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): గుజరాత్ నుంచి నగరానికి వచ్చిన వ్యాపారవేత్త డైరీని ఆటోలో పోగొట్టుకున్నారు. దువ్వాడ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు నిమిషాల వ్యవధిలోనే ఆటోని కనిపెట్టి, డ్రైవర్‌నుంచి డైరీని తీసుకున్నారు. వెంటనే వ్యాపారవేత్తకు ఫోన్ చేసిన సీఐ మల్లేశ్వరరావు, డైరీని ఆయనకు అందజేశారు. దీంతో వ్యాపారవేత్త పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఇద్దరి అదృశ్యంపై ఫిర్యాదు

పెందుర్తి, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): చినముషిడివాడ ఉడా కాలనీకి చెందిన పవన్‌కుమార్‌శర్మ, సావిత్రినగర్‌కి చెందిన ఉప్పలపాటి శ్రీను అదృశ్యమైనట్టు కుటుంబ సభ్యులు గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. శ్రీను గత ఏడాది డిసెంబరు14న, పవన్‌కుమార్‌శర్మ గత నెల 10న ఇంటి నుంచి వెళ్లిపోయారన్నారు. పోలీసులు కేసులు నమోదు చేశారు.

సినిమా గైడ్

- **తండేల్ :** జగదాంబ, సంగం, కామేశ్వరి, శ్రీరామ, శ్రీవెంకటేశ్వర, శ్రీలీలామహల్, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ(గోపాలపట్నం), మోహిని (గాజువాక), అన్నపూర్ణ(కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ),
- **భవానీ వార్డ్ :** జగదాంబ, రమాదేవి
- **మదగజరాజ :** జగదాంబ, వెంకటేశ్వర-1, సౌజన్య (గోపాలపట్నం), శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా),
- **సంక్రాంతికి వస్తున్నాం :** శారద, మెలోడి, జగదాంబ, కిన్నెర, కాంతి, శ్రీలక్ష్మీనరసింహ-1,2 (104 ఏరియా), శ్రీనరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), తాతా, రాములమ్మ (తగరపువలస)
- **డాకు మహారాజ్ :** శరత్, శ్రీకన్య, కిన్నెర, సుకన్య, మోహిని కాంప్లెక్స్, శ్రీకన్య హెవెన్ (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), గణేష్, సప్తగిరి (తగరపువలస)
- **గేమ్ ఛేంజర్ :** మెలోడి, సంగం, కామేశ్వరి, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), .కన్యకాంప్లెక్స్, మోహిని కాంప్లెక్స్ (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-2 (పెందుర్తి) రాములమ్మ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు30, టమాటా 13,వంకాయలు (తెలుపు) 20, వంకాయలు (నలుపు) 26, బెండకాయలు 46, పచ్చిమిర్చి 38, కాకరకాయలు 42, బీరకాయలు 50, ఆనపకాయ 12, కాలీఫ్లవర్ 12, క్యాబేజి 12, క్యారెట్ 30 దొండకాయలు 32, బంగాళ దుంపలు 16, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 100,అల్లం 42, బరబాటి 32, ముల్లంగి 20, నిమ్మకాయలు (కిలో) 62, బద్దచిక్కుడు 26, దోసకాయలు 26, వెల్లులి 160, కొబ్బరికాయ 25, బీన్స్ 38, కీరదోస 30, కాప్సికమ్ 40, పొట్లకాయ 28, చేమదుంపలు 38 చిలగడదుంపలు 38, కంద 56, దేముడు చిక్కుడు 32, గోరు చిక్కుడు 28, కూర పెండలం 26, బ్రకోలి 55 , నూల్‌కోల్ 30, పనసపొట్టు 200, కొండఉసిరి 70, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్దకట్ట) 25, పుదీన (కట్ట) 4, చుక్క కూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 120, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 20, మామిడి అల్లం 46, బొప్పాయి 38, జామకాయలు (కిలో) 60.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	470
విజయనగరం	474
శ్రీకాకుళం	474

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	100
లైవ్ ధర	120
విత్ స్కిన్	210
స్కిన్‌లెస్	220

సోలార్ రూఫ్ టాప్‌లపై ఇంటింటి సర్వే

అవగాహన కల్పిస్తున్న ఈపీడీసీఎల్ అధికారులు



శ్రీనివాసనగర్‌లో సోలార్ రూఫ్ టాప్ పై అవగాహన కల్పిస్తున్న ఈపీడీసీఎల్ ఏడీసీ ఏ.పార్థసారథి, ఏఈ రామకృష్ణ

కూర్మన్నపాలెం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ బిల్లు తగ్గించుకోవాలంటే విధిగా ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజన పథకంలో చేరడం ఉత్తమం అని సోలార్ రూఫ్‌టాప్‌ను నిర్మించుకోవాలని ఈపీడీసీఎల్ ఏడీసీ అడబాల పార్థసారథి, ఏఈ రాయుడు రామకృష్ణ పేర్కొన్నారు. జీవీఎంసీ 70 వార్డు శ్రీనివాసనగర్‌లో గురువారం సోలార్ రూఫ్ టాప్‌పై ఇంటింటికీ నిర్వహించిన సర్వేల్లో భాగంగా వినియోగదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం సబ్సిడీ అందిస్తుందన్నారు. ఒక కిలోవాట్ వ్యవస్థకు రూ.30 వేలు, ఉత్పత్తి అయ్యే 120 యూనిట్లు, వినియోగదారునకు ప్రస్తుతం రూ.1000 బిల్లు వస్తుంటే సోలార్ ఏర్పాటు తర్వాత రూ.338, ఏడాదికి రూ.8000 వేలు ఆదా అవుతుందన్నారు. 2 కిలోవాట్ల వ్యవస్థకు రూ.60 వేలు, 3 కిలోవాట్ల వ్యవస్థకు రూ.78 వేలు కేంద్రం నుంచి రాయితీ లభిస్తుందన్నారు. పెట్టుబడులు కోసం ఎటువంటి పూచీకత్తు లేకుండా తక్కువ వడ్డీకే రుణం తీసుకొనే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ సిబ్బంది, ఎస్వీ నరసింహారావు, లైన్‌మెన్లు, పలువురు వినియోగదారులు పాల్గొన్నారు.

క్రికెట్ పోటీల పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న గాజువాక బీజేపీ కన్వీనర్ నరసింగరావు, పాల్గొన్న క్రీడాకారులు

గాజువాక, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : మాఘ పౌర్ణమి పండుగ సందర్భంగా గంగవరంలో నిర్వహించనున్న క్రికెట్ పోటీల పోస్టర్‌ను గురువారం బీజేపీ స్థానిక కార్యాలయంలో ఆ పార్టీ గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా స్థాయి విండ్‌బాల్ పోటీలు, సూపర్-11 క్రికెట్ లీగ్ సీజన్-2 పేరుతో పోటీలు నిర్వహించనున్నట్టు తెలిపారు. వారం రోజుల పాటు జరగనున్న ఈ పోటీల్లో జిల్లా లోని వివిధ ప్రాంతాల నుంచి క్రీడాకారులు పాల్గొననున్నారన్నారు. కార్యక్రమంలో క్రీడాకారులు సీహెచ్ రాజు, పి.పాలరాజు, జి.సతీష్, నాగేంద్ర పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగులకు అధిక పెన్షన్ ఇవ్వాలి



జాయింట్ కమిషనర్‌ను కలిసిన విశ్రాంత ఉద్యోగులు

మల్కాపురం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): షిప్‌యార్డు, హెచ్‌పీసీఎల్, కోరమాండల్ ఎరువుల కర్మాగారాల విశ్రాంత ఉద్యోగులకు అధిక పెన్షన్ మంజూరు చేయాలని గురువారం పీఎఫ్ కార్యాలయం జాయింట్ కమిషనర్ పవన్‌జాస్తిని కలిసి విన్నవించారు. ఈ మేరకు వినతిపత్రం సమర్పించారు. స్టీల్‌ప్లాంట్‌కు మాత్రమే అధిక పెన్షన్‌ను ఇచ్చేందుకు కేంద్రం అంగీకరించిందని జాయింట్ కమిషనర్ తెలిపారు. దీనిపై లేఖ రాశామన్నారు. కాగా అధిక పెన్షన్ కోసం విశ్రాంత ఉద్యోగులు, వారి కుటుంబాలు ఆందోళనకు సిద్ధం కావాలని ఆ సంఘం ప్రతినిధులు పిలుపునిచ్చారు. జాయింట్ కమిషనర్‌ను కలిసిన వారిలో కేవీ కుమార్, ఎన్.రామలింగేశ్వరరావు, వి.అప్పలరాజు, నారాయణరావు తదితరులున్నారు.

కార్మికుల నిరసనకు వివిధ యూనియన్ల సంఘీభావం

ఎన్ఏడీ జంక్షన్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): సత్యాగ్రహ దీక్ష శిబిరం వద్ద ఫ్లెక్సీల చించివేతతో ఆందోళనకు గురైన కార్మికులకు వివిధ యూనియన్‌ల నేతలు సంఘీభావం తెలిపారు. ఓటీని అమలు చేయాలని నిరసన తెలిపిన 36 మంది ఎన్ఏడీ ఉద్యోగులను సీజీఎం సస్పెండ్ చేయడంతో గత రెండు నెలలుగా దీక్ష చేస్తున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం గుర్తుతెలియని వ్యక్తులు దీక్షా శిబిరం వద్ద ఫ్లెక్సీలను చింపేయడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీసీ కెమెరాల సాయంతో దోషులను గుర్తించి, శిక్షించాలని వివిధ యూనియన్ల నేతలు డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో ఏఐడీఈఎఫ్ కోఆర్డినేషన్ కమిటీ అధ్యక్షుడు రెడ్డి వెంకట్రావు, ఎన్ఏడీ సీఈ యూనియన్ గౌరవాధ్యక్షుడు కేవీ థామస్, అధ్యక్షుడు పీఏ రాజు, ఎన్ఎస్‌టీఎల్ సీఈ యూనియన్ అధ్యక్షుడు సునీల్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

స్టెమీ చికిత్సతో గుండెపోటు మరణాల నియంత్రణ



సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న గోపాలపట్నం సీహెచ్‌సీ డాక్టర్ సుజాత

గోపాలపట్నం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): స్టెమీ చికిత్సతో గుండెపోటు మరణాలను తగ్గించవచ్చని స్థానిక సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ సుజాత పేర్కొన్నారు. హృద్రోగులకు స్టెమీ చికిత్స విధానంపై గురువారం సిబ్బందికి అవగాహన కల్పించారు. గుండె నొప్పి, ఎడమ భుజం లాగడం, ఆయాసం, గుండెదడ, స్పృహ కోల్పోవడం వంటి లక్షణాలుంటే వెంటనే వైద్యుల్ని సంప్రదించాలన్నారు. హృద్రోగం ఉన్నట్టు నిర్ధారణ జరిగే వారికి రూ.45వేలు విలువ చేసే ఇంజక్షన్ ఉచితంగా అందిస్తామన్నారు. ఈ లక్షణాలు ఉన్న వారు సకాలంలో వైద్యుల్ని సంప్రదించి స్టెమీ చికిత్స చేయించుకోవడం ద్వారా కోలుకోవచ్చన్నారు. కార్యక్రమంలో వైద్యులు, అధికారులు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

పీఎఫ్ తేదీల మార్పుపై కార్మికుల ఆందోళన

అక్కిరెడ్డిపాలెం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): పీఎఫ్ ఖాతాలలో తేదీల మార్పుపై బెల్ హెచ్‌పీవీపీ కార్మికులు గురువారం గుర్తింపు యూనియన్ కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. ఆర్ సిరీస్ కార్మికులుగా 1992లో చేరిన 160 మంది వేతనాల నుంచి పీఎఫ్ కట్ చేసినప్పటికీ 2011లో పర్మినెంట్ అయినప్పటి నుంచి వసూలు జరిగినట్లు రికార్డులలో నమోదు కావడం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. దీనివల్ల రిటైర్‌మెంట్ తరువాత తక్కువ పెన్షన్ వస్తుందని, బకాయిలు రావన్నారు. యాజమాన్యంతో కార్మిక నేతలు చర్చించి 1992 నుంచి పీఎఫ్ అమలయ్యేలా రికార్డులను సరిచేసి న్యాయం చేయాలని కోరారు. యాజమాన్యం చేసిన తప్పిదానికి కార్మికులను బలిచేయవద్దని వారు కోరారు.

అతిపెద్ద ప్రజాస్వామ్య సాధనంగా సోషల్ మీడియా

సీనియర్ సంపాదకులు కె.శ్రీనివాస్



ప్రసంగిస్తున్న సీనియర్ సంపాదకులు కె.శ్రీనివాస్

విశాఖపట్నం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): అతిపెద్ద ప్రజాస్వామ్య సాధనంగా సామాజిక మాధ్యమం (సోషల్ మీడియా) నిలుస్తోందని సీనియర్ సంపాదకులు కె.శ్రీనివాస్ అన్నారు. 'మిత్రసాహితీ' సంస్థ ఆధ్వర్యంలో గురువారం పౌర గ్రంథాలయంలో నిర్వహించిన 'జర్నలిజం-వెలుగు నీడలు' అంశంపై నిర్వహించి న కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సామాజిక మాధ్యమంలో స్వేచ్ఛగా భావవ్యక్తీకరణకు అవకాశం లభిస్తోందని, కొన్ని సందర్భాల్లో ఎక్కువగా అసత్యం వ్యాప్తి చెందుతోందన్నారు. ప్రజల్లో తెలుసుకోవాలన్న ఆసక్తి లేకపోవడంతోనే ఇన్వెస్టిగేటివ్ జర్నలిజానికి ఆస్కారం లేకుండా పోయిందన్నారు. దేశంలో ప్రముఖ మీడి యా సంస్థలు మోదీ గుప్పిట్లోకి వెళ్లిపోయి నిర్వీర్యం అయిపోయాయన్నారు. చాలావరకూ అంబానీ, అదానీ చేతుల్లో ఉన్నాయన్నారు. ఈ నేపథ్యంలో అత్యధికులు సామాజిక మాధ్యమాలను వినియోగిస్తు న్నారన్నారు. గతంతో పోలిస్తే జర్నలిజంలో ఒత్తిడి పెరిగిందన్నారు. ప్రజల్లో సమ్మతి, అసమ్మతిని సృష్టించడంలో మీడియా కీలక పాత్ర పోషిస్తుందని, సమాజానికి, మీడి యాకు మధ్య దూరాన్ని గుర్తించి భర్తీచేసే దిశగా న్యూ మీడియాతో వచ్చేందుకు యత్నిస్తున్నామని వెల్లడించారు. లీడర్ పత్రిక ఎడిటర్ వీవీ రమణమూర్తి మాట్లా డారు. బిజినెస్ లైన్ అసోసియేట్ ఎడిటర్ కేవీ కూర్మనాథ్ సామాజిక మాధ్యమాల వినియోగంలో ఏఐ సహా అధునాతన సాంకేతికత తీసు కువచ్చిన మార్పుల గురించి వివరించారు. కార్యక్రమానికి మిత్రసాహితీకి చెందిన ప్రసాదవర్మ అధ్యక్షత వహించారు.

వేతనాల కోసం వినతి

ఉక్కుటౌన్‌షిప్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులకు వేతనాలు ఇప్పించేందుకు కృషి చేయాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, రాజమండ్రి ఎంపీ డి.పురందేశ్వరిని స్టీల్ ఫెడరేషన్ అధ్యక్షుడు కొమ్మినేని శ్రీనివాసరావు, స్టీల్ బీఎంఎస్ అధ్యక్షుడు ఎం.రామస్వామి కోరారు. ప్లాంటుకు భారీ ప్యాకేజీ అభినందనీయమని, ఉద్యోగ సమస్యలపై దృష్టి సారించి వేతనాలివ్వాలన్నారు.

సాయిబాబాకు పూజలు

అగనంపూడి: స్థానిక షిర్డీసాయి సేవా సమితి ఆధ్వర్యంలో గురువారం బాబాకు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు స్వామిని దర్శించుకున్నారు. సేవా సమితి ఆర్థిక సాయంతో అన్నదానం చేశారు.

ఉక్కు కార్మికులకు తక్షణమే జీతాలివ్వాలి

పోరాట కమిటీ చైర్మన్ ఆదినారాయణ



దీక్షలో పాల్గొన్న ఆదినారాయణ, ఉక్కు కార్మికులు

కూర్మన్నపాలెం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : పోరాడి సాధించుకున్న ఉక్కును కాపాడుకుంటామని, ఉక్కు కార్మికులకు తక్షణమే జీతాలు ఇవ్వాలని విశాఖ ఉక్కు పోరాట కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ అన్నారు. కూర్మన్నపాలెం కూడలిలో విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్ష గురువారం 1456వ కు చేరింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముడి ఇనుప ఖనిజం బయట మార్కెట్ ద్వారా కొనుగోలు చేయటం వల్లే ఉక్కు కర్మాగారానికి అప్పు ఉందన్నారు. నేడు 31 లక్షల టన్నులు హాట్ మెటల్ రికార్డు స్థాయిలో ఉత్పత్తి చేసిన కార్మికులకు 5 నెలులగా పూర్తి స్థాయిలో జీతాలు ఇవ్వకుండా ఉక్కు యాజమాన్యం ఇబ్బందులు పాలుజేయటం తగదన్నారు. కార్యక్రమంలో కమిటీ నాయకులు ఎన్.రామారావు, పలువురు ఉక్కు కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

అభిమానికి చిరు ఫ్యాన్స్ రూ.లక్ష ఆర్థిక సాయం



ఆర్థిక సహాయం అందజేస్తున్న చిరు ఫ్యాన్స్

అక్కిరెడ్డిపాలెం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : తుంగ్లాంలో తీవ్ర అనారోగ్యానికి గురైన చిరంజీవి ఫ్యాన్స్ గాజువాక అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు చాట్ల శంకరరెడ్డికి గురువారం స్టేట్ చిరంజీవి ఫ్యాన్స్, గాజువాక చిరంజీవి ఫ్యాన్స్ అసోసియేషన్ నాయకులు పరామర్శించారు. చిరంజీవి యువత వ్యవస్థాపక అధ్యక్షుడు ఆర్.స్వామినాయుడు, కొయిలాడ శ్రీనివాసరావుల ఆదేశాల మేరకు శంకరరెడ్డికి రూ.లక్ష ఆర్థిక సహాయాన్ని అందచేశారు. శంకరరెడ్డిని పరామర్శించిన వారిలో ఎం.దేముడు, పి.వెంకటరమణ, పీఎస్ ఆనంద్, జె.రవి, పల్లా కనకరాజు, ఏహెచ్ శ్రీను, టి.శ్రీనివాసరావు ఉన్నారు.

సీనియర్ సిటిజన్లకు సత్కారం



సత్కార గ్రహీతలు

పెందుర్తిరూరల్, ఫిబ్రవరి 6 (ఆంధ్ర జ్యోతి): స్థానిక సీనియర్ సిటిజన్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గురువారం పలువురిని సత్కరించారు. కార్పొరేటరు ముమ్మన దేముడు సీనియర్ సిటిజన్లు జీఎస్ ప్రకాశరావు, ఆనందరావు, ఎం.నాగేశ్వరరావు,జె.ప్రభాకర్ దంపతులను సత్కరించారు. కార్యక్రమంలో కొమ్మాన సన్యాసిరావు, నరేంద్రకుమార్, చిన్నంనాయుడు, గోపాలరావు, రమణారావు, అరుణకుమార్, పైడికొండ పాల్గొన్నారు.

ఘనంగా భూలోకమాంబ అమ్మవారి పునఃప్రతిష్ఠోత్సవాలు





పసుపు నీళ్ల బిందెలతో వస్తున్న మహిళలు, అలంకరణలో ముత్యాలమ్మ

వేపగుంట, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): అప్పన్నపాలెం భూలోకమాంబ ఆలయ పునఃప్రతిష్ఠోత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. సింహాచలం ఏఈఓ నక్కాఆనందరావు దంపతులు, కమిటీ గౌరవాధ్యక్షుడు పీతల అప్పలరాజు ప్రారంభించారు. మహిళలు పసుపు నీటి బిందెలతో ఊరేగింపు నిర్వహించారు. ప్రతిష్ఠా తీర్థ సంకల్పం, విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవచనం, పరిషత్తు, కృచ్ఛ్రత్రయం, దీక్షధారణ, యాగశాల ప్రవేశం, వేదికా కుండల సంస్కారం, అఖండదీప స్థాపన, వేదగోష్ఠి నిర్వహించారు. పీతల విష్ణుమూర్తి, పల్లా వెంకటరావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ముత్యాలమ్మ అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు అర్చనలు, జరిగాయి. మధ్యాహ్నం కట్ట గిరి శ్రీదేవి దంపతుల ఆర్థిక సాయంతో అన్నదానం చేశారు.

వేడుకగా శోభా యాత్ర

చినముషిడివాడ శారదా పీఠం వార్షికోత్సవాల్లో భాగంగా గురువారం శోభాయాత్ర నిర్వహించారు.ఉత్తర పీఠాధిపతి సాత్మానందేంద్ర సరస్వతి యాత్రను ప్రారంభించారు. అంతకుముందు గోపూజ, దక్షణామూర్తికి పంచామృతాభిషేకాలు చేశారు. సుబ్రమణ్యస్వామికి వేద పండితులు కల్యాణం నిర్వహించారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు పరిధి పెదమడకలో నిర్మిస్తున్న రామాలయానికి దాతలు కె.వెంకటరమణారెడ్డి, అరుణ దంపతులు రూ.10,116 విరాళాన్ని గురువారం ఆలయ కమిటీ ప్రతినిధులు అందజేశారు.

టీఎన్టీయూసీలో చేరిన ఉక్కు ఉద్యోగులు



ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు సమక్షంలో టీఎన్టీయూసీలో చేరిన ఉద్యోగులు

గాజువాక, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని కూటమి ప్రభుత్వం నిలబెట్టుకుంటుందని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. పార్టీ కార్యాలయంలో గురువారం టీఎన్టీయూసీలో పలువురు ఉద్యోగులు చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాంట్‌కు అన్ని విధాలా సహకరించేందుకు కూటమి ప్రభుత్వం ముందుంటుందన్నారు. కార్యక్రమంలో టీఎన్టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోగంటి లెనిన్‌బాబు, టీడీపీ గాజువాక సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్, నమ్మి సింహాద్రి, గుమ్మడి నరేంద్రకుమార్, పెద్దాడ సోమినాయుడు, శివనాగేశ్వరరావు, రఘుప్రసాద్, లక్ష్మణరావు, రాంబాబు, రాజేష్ పాల్గొన్నారు.

ఈపీఎఫ్ 95 పెన్షనర్ల ఆందోళనకు మద్దతు

స్టీల్‌పాంటు రిటైర్డ్ ఉద్యోగుల అసోసియేషన్ తీర్మానం



సమావేశంలో మాట్లాడుతున్న నమ్మి అప్పారావు, పాల్గొన్న ప్రతినిధులు

పెదగంట్యాడ, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 11, 12 తేదీల్లో కేంద్రప్రభుత్వ పెన్షనర్ల అసోసియేషన్ చేపట్టనున్న ఆందోళనకు మద్దతు ఇవ్వాలని స్టీల్‌ప్లాంట్ రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ 75వ వార్డు శాఖ నిర్ణయించింది. సీతానగరం మినీ కల్యాణమండపం ఆవరణలో అసోసియేషన్ గురువారం సమావేశమై ఈ మేరకు తీర్మానం చేసింది. వార్డు టీడీపీ అధ్యక్షుడు నమ్మి అప్పారావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో అసోసియేషన్ కార్యవర్గం సభ్యులు నక్క దుర్గబాబు, నమ్మి అప్పలనాయుడు, చేశెట్టి అప్పారావు, నంబారు అప్పలనాయుడు, మొల్లి సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

ట్రైనింగ్ హెచ్‌వోడీకి అభినందనలు



ఠాగూర్‌ను అభినందిస్తున్న ఉద్యోగులు

ఉక్కుటౌన్‌షిప్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్ హెచ్ఆర్డీ ట్రైనింగ్ సెంటర్ హెచ్‌వోడీగా బాధ్యతలు స్వీకరించిన పీకేఎస్ఆర్ ఠాగూర్‌ను విభాగం అధికారులు, ఉద్యోగులు గురువారం కలిసి అభినందనలు తెలిపా రు. ఈ సందర్భంగా ఠాగూర్ మాట్లాడుతూ ఉద్యోగులు, విద్యార్థులకు శిక్షణ విషయంలో ట్రైనింగ్ సెంటర్ కీలకపాత్ర పోషిస్తుందన్నారు. విభాగం మరింత ప్రగతి కోసం విశేష కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో డీజీఎం ఎం.గణేష్‌బాబు, ఏజీఎంలు పి.రాజేశ్‌వర్మ, కెఎల్ఎస్ కుమారి, అధికారులు వి.శ్రీనివాసరావు. డి.కృష్ణారావు, ఎం.నాగేశ్వరరరావు, ఎ.గోవిందరావులు పాల్గొన్నారు.

నేడు తాగునీటి సరఫరా నిలిచే ప్రాంతాలు

వేపగుంట ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ జోన్ 8 పరిధిలో శుక్రవారం తాగునీటి సరఫరా నిలిపివేస్తామని నీటి సరఫరా విభాగం డీఈ వీరయ్య ఒక ప్రకటనలో తెలిపారు. కృష్ణాపురం హెడ్ వాటర్ వర్క్స్ పంప్ హౌస్ మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 10 నుంచి శనివారం 10 గంటల వరకు నీటి సరఫరా జరగదన్నారు. 93వ వార్డు సాయిదుర్గానగర్, దుర్గానగర్, అప్పలనరసింహింకాలనీ, లక్ష్మీపురం, పోర్టుకాలనీ, రామ కోఆపరేటివ్ కాలనీ, హెచ్.బి.కాలనీగోకూల్ధామ్‌కాలనీ, రెల్లివీధి, కృష్ణరాయపురం, గొల్లివిల్లిపాలెం, ఎల్.ఐ.సీకాలనీ, సుజాతానగర్, పాపయ్యరాజుపాలెం, పెందుర్తి పాత ఊరు, తెలకలవీధి, జడ్పీహెచ్ఎస్ ఏరియా, ప్రశాంతినగర్, క్రాంతినగర్, ఉడాకాలనీ, రైల్వే కాలనీ, సావిత్రినగర్, అప్పన్నపాలెం, సింహపురిలేఅవుట్, అడవివరం, ఎస్సీ కాలనీ, పాత అడవివరం ప్రాంతాల వాసులకు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తామన్నారు.

15 రోజులుగా తాగునీటికి ఇక్కట్లు

పట్టించుకోవడం లేదని అశోక్‌నగర్ కాలనీ వాసుల ఆగ్రహం

పెదగంట్యాడ, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 65వ వార్డు పరిధి అశోక్‌నగర్ కాలనీలో 15 రోజులుగా కొళాయినీరు రావడం లేదు. దీంతో కాలనీ వాసులు తాగునీటి ఎద్దడిని ఎదుర్కొంటున్నారు. ఇక్కడ ఉన్న 11 వీధులు ఉండగా, ఈ కాలనీలో 80 శాతం ఇళ్లకు మున్సిపల్ కొళాయిలు ఉన్నాయి. వీరంతా మున్సిపల్ కొళాయి నీటి పైనే ఆధారపడుతుంటారు. అయితే మున్సిపల్ కొళాయిల నుంచి నీరు రాక పోవడంతో వీరంతా ప్రత్యామ్నాయంగా గొట్టపు బావులపై ఆధార పడాల్సి వస్తోంది. ఈ కాలనీ కొండవాలు ప్రాంతంలో ఉండడంతో మున్సిపల్ కొళాయిలకు నీరు పంపింగ్ చేసినప్పుడు నీరు దిగువ ప్రాంతాలకే వస్తుంది. ఎగువ ప్రాంతాల్లో నివసించే వారికి సంవత్సరాలు తరబడి కొళాయి నీరు రావడంలేదు. స్థానిక కార్పొరేటర్, మున్సిపల్ తాగునీటి సరఫరా విభాగం అధికారులకు ఎన్నిసార్లు విజ్ఞప్తులు చేసినా ప్రయోజనం లేకపోయిందని కాలనీ వాసులు అంటున్నారు. ప్రస్తుతం 15 రోజులుగా మున్సిపల్ కొళాయిల నుంచి నీరు రావడం లేదని, కనీసం ట్యాంకర్ల ద్వారా అయినా నీటి సరఫరా చేయడం లేదని స్థానికులు వాపోతున్నారు. ఠంచనుగా నీటి పన్ను వసూలు చేస్తున్న జీవీఎంసీ అధికారులు నీటి సరఫరా విషయంలో మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారంటూ స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జీవీఎంసీ అధికారులు తక్షణమే చర్యలు తీసుకొని మున్సిపల్ కొళాయిల ద్వారా నీటిని సరఫరా చేయాలని కోరుతున్నారు.

'దామెర్ల పేరిట అవార్డు ప్రకటించాలి'

మల్కాపురం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ చిత్రకారులు దామెర్ల రామారావు పేరుతో అవార్డు ప్రకటించాలని విశాఖ చిత్రకళ పరిషత్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు బీఎస్ఆర్ భవన్‌లో గురువారం జరిగిన దామెర్ల శతజయంతి సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. పరిషత్ అధ్యక్షులు డి.తాగ్యరాజు, చిత్రకళా విమర్శకులు సుంకర చలపతిరావు మాట్లాడారు. రాజమహేంద్రవరంలో ఉన్న దామెర్ల గ్యాలరీని సాంకేతిక శాఖ నుంచి సాంస్కృతిక శాఖకు బదిలీ చేయాలన్నారు. కార్యక్రమంలో చిత్రకారులు జీఎస్ ప్రకాశ్, బీఎస్ఆర్ ఫౌండేషన్ కార్యదర్శి బుజ్జి, చిత్రకారులు సుధాకర్, బంగారు రాజు, పీసీ శేఖర్ మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

గర్భం దాల్చిన వసతి గృహం విద్యార్థిని!

పోలీసుల అదుపులో యువకుడు ?

భీమునిపట్నం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): భీమిలిలోని బీసీ కళాశాల బాలికల వసతి గృహంలో ఉంటున్న విద్యార్థి ఒకరు గర్భవతి కావడం కలకలం రేపింది. సీఐ సుధాకర్ తెలిపిన వివరాలు ప్రకారం...అనకాపల్లి జిల్లాకు చెందిన ఒక బాలిక (17) భీమిలిలోని డిగ్రీ కళాశాలలో ప్రథమ సంవత్సరం చదువుతోంది. బీచ్‌రోడ్డులో ఉన్న ప్రభుత్వ బాలికల వసతి గృహంలో ఉంటోంది. అదే గ్రామానికి చెందిన యువకుడు (18) మధురవాడలో గల ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ ప్రథమ సంవత్సరం చదువుతున్నాడు. ఇద్దరూ కొంత కాలంగా ప్రేమించుకుంటున్నారు. శారీరకంగా ఒక్కటయ్యారు. ఈ క్రమంలో బాలిక గర్భం దాల్చింది. గర్భం పోయేందుకు ఏవో టాబ్లెట్లు వేసుకోవడంతో తీవ్ర రక్తస్రావమైంది. దీంతో గురువారం ఇద్దరూ కేజీహెచ్‌కు వెళ్లారు. పరీక్షించిన వైద్యులు బాలిక మైనర్ కావడంతో వివరాలు ఆరా తీసి, భీమిలి పోలీసులకు సమాచారం ఇచ్చారు. కాగా బాలికకు తీవ్ర రక్తస్రావం అవుతుండడంతో వైద్యులు అబార్షన్ చేశారు. ఆ యువకుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ విషయమై సంబంధిత హాస్టల్ మేట్రిన్ భారతితోను, భీమిలి అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ జ్యోతిశ్రీతో మాట్లాడడానికి యత్నించగా వారు ఫోన్‌కు అందుబాటులో లేరు.

మురళీనగర్‌లో ఇష్టారాజ్యంగా దుకాణాలు

- వైసీపీ ప్రభుత్వ హయాంలో విచ్చలవిడిగా ఏర్పాటు
- ఆక్రమణలకు గురైన రోడ్లు
- పట్టించుకోని అధికారులు




కళింగనగర్ ఈస్ట్ పార్క్ పార్కింగ్ ప్రదేశంలో ఏర్పాటు చేసిన బడ్డీలు, మద్రిపాలెం రైతుబజారు ఎదుటే అద్దెకు ఇవ్వడానికి సిద్ధం చేసిన బడ్డీ

మురళీనగర్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : విశాఖ ఉత్తరం నగరం నడిమధ్య నివాసయోగ్యానికి అనువుగా ఉండే ప్రాంతాలుగా పేరొందాయి. అలాంటి ప్రాంతాలు సహా నగర వ్యాప్తంగా ఉన్న రెసిడెన్షియల్ కాలనీలను సైతం గత వైసిపి పాలకులు రోడ్లపైన, కాలువలపైన అధికారిక బడ్డీలు పెట్టి అమూల్ దుకాణాలకు తెర తీసారు. ఈ ప్రభావం ఇపుడు విశాఖ ఉత్తర నియోజకవర్గ ప్రాంతాల్లో బడ్డీల వరుసలే తారసపడుతున్నాయి. ముఖ్యంగా జన నివాసాలు అధికంగా పెరుగుతున్న మురళీనగర్, మాధవధార, మద్రిపాలెం, ఎన్‌జీజీఓస్ కాలనీ, పట్టాభిరెడ్డి తోట ప్రాంతాల్లో 48ఎ బస్ రూట్ మొత్తం రహదారి కబ్జాలపాలై ప్రయాణికులకు చుక్కలు చూపిస్తున్నారు. అడుగడుగునా వెలుస్తున్న బడ్డీలకు అధికారికంగా కరెంటు సరఫరా చేస్తున్నారు. పన్ను కట్టించుకుని, ట్రేడ్ లైసెన్సులు జారీ చేస్తున్నారు. ఈ ప్రభావం ఇప్పుడు పెట్టుబడి లేని వ్యాపార స్థలంగా రహదారి మారుతోంది. ఏదైనా వ్యాపారం చేయాలంటే షాప్ పెట్టాలి. అందుకు వాణిజ్య అవసరాలకు కట్టే కాంప్లెక్సుల్లో అయితే బయానాలు చెల్లించాలి. అద్దె చెల్లించాలి. కానీ, రోడ్డు మార్గం అయితే ఆ వార్డు కార్పొరేటరు, స్థానిక రాజకీయ నేతల ఆశీస్సులు ఉంటే చాలు..! జీవిత కాల లైసెన్సును వారే ఇచ్చేస్తున్నారు. రోడ్డు రాసి ఇచ్చేస్తారు. బడ్డీ తయారు చేయించుకుని రోడ్డు మీదే బస్టాపుని ఆక్రమించి పెట్టుకోవచ్చు. రోడ్డు మలుపుల్లో ఫ్రీ లెఫ్ట్‌లో పెట్టొచ్చు. పార్కు పార్కింగ్ స్థలంలోనూ ఏర్పాటు చేసుకునే వెసులుబాటు మాధవధార, మురళీనగర్ ప్రాంతాల్లో నాయకులే కల్పిస్తున్నారు. వారి దృష్టిలో అది బతుకుతెరువు చూపించడం. మంచి చేయడం !

కళింగనగర్ ఈస్ట్ పార్క్ పార్కింగ్ కబ్జా

గతేడాది జూన్ నెలలో ఎన్డీఏ సర్కారు ఏపీలో అధికారంలోకి వచ్చిన తర్వాత విశాఖ ఉత్తరంలోని 51వ వార్డు కళింగనగర్ ఈస్ట్ పార్క్ అభివృద్ధికి రూ.39 లక్షలతో స్థానిక ఎమ్మెల్యే పి. విష్ణుకుమార్ రాజు అంకురార్పణ చేశారు. కొత్త గడులు కట్టారు. పచ్చదనం పెంచారు. నడక మార్గాన్ని వెడల్పు చేశారు.వచ్చేవారికి పార్కింగ్ సదుపాయం కూడా కల్పిస్తూ కాలువలపై సిమెంటు దిమ్మెలు వేయించి, పార్కు గోడ పొడవునా పార్కింగ్ ప్రదేశంగా పేర్కొంటూ బోర్డులు కూడా రాయించారు. కానీ, పరిపాలన బాధ్యతలు చూడాల్సిన పార్కు కమిటీ సభ్యుల అలసత్వంతో ఇప్పుడు ఈస్ట్ పార్కు గోడ చుట్టూరా బడ్డీలు వెలిశాయి. మొదట అమూల్ పాల బడ్డీ పెట్టారు. దానిని ఆనుకొనే ఇప్పుడు ఈ దారికి ఇరువైపులా బడ్డీలు వెలిశాయి. ఏకంగా 48ఎ కళింగనగర్ బస్టాప్‌లోనే నెలల క్రితం ఏర్పాటైన కూరగాయల దుకాణంపై ఫిర్యాదులు వచ్చినా, స్థానిక అధికారులు స్పందించలేదు. దీంతో పక్కనే మరో చికెన్ కొట్టు, నూడిల్స్ బడ్డీ ఇలా.. దారంతా బడ్డీల ఆక్రమణలతో పార్కుకు ఉదయం, సాయంత్రం వేళల్లో వచ్చేవారు నానా ఇబ్బందులు పడుతున్నారు. బైక్ పార్కింగ్ చేసుకునే వీలు లేక బస్సులు తిరిగే మెయిన్ రోడ్డులో అడ్డదిడ్డంగా బళ్లు నిలిపేస్తున్నారు.

జీవన భృతి కాదు... అద్దెల వ్యాపారం!

మురళీనగర్ ఎన్‌జీజీఓస్ కాలనీ,బర్మాక్యాంప్ మెయిన్ రోడ్డు, ఆర్టీఏ ఆఫీసు దారిలోని బడ్డీలు, మద్రిపాలెం రైతుబజార్ రోడ్లలో నెలకు రూ.4 వేల అద్దెకు బడ్డీలు పెట్టేశారు. కరెంటు ఉంది. పన్ను బుక్ ఉంది... అంటూ డిమాండ్ చేసి బడ్డీలను అద్దెకు నడుపుతున్నారు. జీవీఎంసీ నియంత్రణలో ఉండాల్సిన రోడ్లు ఆక్రమణకు గురవుతున్నా, నగర టౌన్ ప్లానింగ్ విభాగం నిమ్మకు నీరెత్తినట్లు మిన్నకుండిపోతోంది. ప్రజాధనంతో వేసిన రోడ్లు అధికారుల అలసత్వంతో ఇలా దురాక్రమణలకు గురవుతున్నాయి. పైగా రద్దీగా ఉండే ఈ ప్రాంతాల్లో బడ్డీల ఆక్రమణల వల్ల తరచూ వాహనదారులు ప్రమాదాల పాలవుతున్నారు. సమస్య పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

జిల్లా ఈగల్ వింగ్ సీఐగా రమేశ్

మహారాణిపేట, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి విశాఖ జిల్లా ఈగల్ వింగ్ (ఎలైట్ యాంటీ నార్కోటిక్ గ్రూప్ ఫర్ లా ఎన్‌ఫోర్స్‌మెంట్) జోనల్ సీఐగా ఎస్. రమేశ్ నియామితులయ్యారు. ఈమేరకు గురువారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. రమేశ్ జిల్లాలో 2010 నుంచి 2022 వరకుఎస్ఐగా లా అండ్ ఆర్డర్, క్రైమ్, ట్రాఫిక్ విభాగాల్లో పనిచేశారు. 2023లో సీఐగా పదోన్నతి పొంది ఏజెన్సీలోని పలు ప్రాంతాల్లో సమర్థంగా విధులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ గంజాయి, డ్రగ్స్, ఇతర మాదక ద్రవ్యాల సరఫరాపై ఎటువంటి సమాచారం ఉన్నా, టోల్ ఫ్రీ నెంబరు 1972 కు డయల్ చేసి తెలిపాలని కోరారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

జ్ఞానాపురం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : కంచరపాలెం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని జ్ఞానాపురం 11 కేవీ ఫీడర్ నిర్వహణ పనుల దృష్ట్యా శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా నిలిపివేయనున్నట్టు జోన్-2 ఈఈ టీకే నాయకులు తెలిపారు. గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. కాన్వెంట్ కూడలి, జ్ఞానాపురం, పైడిమాంబ కాలనీ, ఎఫ్‌సీఐ గోదాం ప్రాంతాలకు సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి, సహకరించాలని ఆయన కోరారు.

అక్కయ్యపాలెం : నిర్వహణ పనులు చేపడుతున్నందున ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ ఈఈ బి. సింహాచలం నాయుడు తెలిపారు. శ్రీనివాసనగర్, నందగిరినగర్, వేంకటేశ్వరకాలనీ, ఎనభై అడుగుల రోడ్డు,తాటిచెట్లపాలెం,రైల్వే క్వార్టర్స్, అబిద్‌నగర్, వేణుగోపాలస్వామి ఆలయం ఏరియా, రామచంద్రానగర్, కేవీ స్కూల్ ఏరియా, టిడ్కో బిల్డింగ్స్ అన్నా క్యాంటీన్ ఏరియాల్లో కరెంట్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

శ్రీనివాసనగర్‌లో ధ్వజ, శిఖర ప్రతిష్ఠ

అక్కయ్యపాలెం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ 44వ వార్డు శ్రీనివాసనగర్‌లో సిద్ధి గణపతి గిరిజా సుందరేశ్వర సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవాలయంలో గురువారం ధ్వజ, శిఖర ప్రతిష్ఠ కార్యక్రమం జరిగింది. శ్రీకాకుళంలోని దేవి ఆశ్రమం, దేవి ఉపాసకులు సహస్ర చక్ర ప్రతిష్ఠాపకులు బ్రహ్మశ్రీ తేజో మూర్తి బాలభాస్కర శర్మ ఈ కార్యక్రమం నిర్వహించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

'ఒక ఊరి కథ' సినిమా ప్రదర్శన

సీతంపేట, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ద్వారకానగర్‌ల పౌరగ్రంథాలయంలో వైజాగ్ ఫిల్మ్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తెలుగు సినిమా దినోత్సవం సందర్భంగా రెండో రోజు గురువారం 'ఒక ఊరి కథ' సినిమాను ప్రదర్శించారు. జాతీయ అవార్డు పొందిన చిత్రమని, మానవ సంబంధాల ఇతివృత్తంలో రూపొందిన తెలుగు చిత్రమని వక్తలు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైజాగ్ ఫిల్మ్ సొసైటీ కార్యదర్శి నరవ ప్రకాశరావు, పూర్ణ పిక్చర్స్ అధినేత జి.ఎన్.మంగరాజు, కృష్ణారావు, పాల్, బాబూరావు, శారద తదితరులు పాల్గొన్నారు.

ఎరుకుమాంబ ఆలయంలో భీష్మ ఏకాదశి వేడుకలు రేపు

దొండపర్తి,ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : దొండపర్తిలోని ఎరుకుమాంబ దేవస్థానంలో ఈనెల 8,9 తేదీల్లో భీష్మ ఏకాదశి వేడుకలు నిర్వహించనున్నట్లు ఈవో రమాబాయి తెలిపారు. ఆలయ ఆవరణలో గురువారం కరపత్రాలు ఆవిష్కరించి ఆమె మాట్లాడుతూ 8న ఉదయం 6 నుంచి మరుసటి రోజు ఉదయం 6 గంటల వరకు హరిహర నామ సంకీర్తన, ఏకాహ మహోత్సవం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. 26న మహాశివరాత్రి వేడుకలు వైభవంగా నిర్వహిస్తామని తెలిపారు.

జనసేన పార్టీని బలోపేతం చేద్దాం

దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

సీతంపేట, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): కార్యకర్తలు, నాయకులు, వార్డు అధ్యక్షులు సహా ప్రతి ఒక్కరూ పార్టీ సంస్థాగత నిర్మాణంపై దృష్టి సారించాలని జనసేన పార్టీ విశాఖ నగర అధ్యక్షుడు, దక్షిణ నియోజకవర్గ శాసనసభ్యుడు వంశీకృష్ణ శ్రీనివాస్ పిలుపునిచ్చారు. సీతంపేట రాజేంద్రనగర్‌లోని నగర పార్టీ కార్యాలయంలో గురువారం విశాఖ దక్షిణ నియోజకవర్గం వార్డు అధ్యక్షులు, నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వంశీకృష్ణ శ్రీనివాస్ మాట్లాడుతూ జనసేన పార్టీ బలోపేతానికి నగర కమిటీలు, వార్డు అనుబంధ కమిటీలు ఏర్పాటు చేయాలని సూచించారు. పార్టీ కేంద్ర కార్యాలయం ఆదేశాల మేరకు త్వరలో కమిటీల విధి విధానాలు తెలియజేస్తామన్నారు. ఉపముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ ఆదేశాలు, సూచనలు ప్రతి ఒక్కరూ పాటించాలన్నారు. పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేయడానికి అందరం కృషి చేద్దామన్నారు. సమావేశంలో పాల్గొన్న పలువురు ప్రస్తుత వార్డు అధ్యక్షులు కొందరిని మార్చాలని కోరగా, మరికొందరు వారి పనితీరుపై అసహనం వ్యక్తం చేశారు. అందరినీ ఎమ్మెల్యే సముదాయించడంతో పాటు కలిసికట్టుగా ఉండాలని సూచించారు. కూటమి కార్యకలాపాల్లో పాల్గొనాలన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ ఇంచార్జ్ ప్రశాంతి, పార్టీ ముఖ్యనేతలు, వార్డు అధ్యక్షులు పాల్గొన్నారు.



సమావేశమైన వివిధ శాఖల అధికారులు, ఆలయ కమిటీ సభ్యులు

27 నుంచి దుర్గాలమ్మ ఉత్సవాలు

పూర్ణామార్కెట్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : వన్‌టౌన్ పూర్ణామార్కెట్ దుర్గాలమ్మ ఆలయ వార్షికోత్సవం ఈనెల 25 నుంచి జరగనుంది. ఈమేరకు జిల్లా రెవెన్యూ అధికారి శ్రీలేఖ గురువారం ఆలయ ఆవరణలో పలు శాఖల అధికారులు, కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉత్సవాల్లో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. 25న తొలేళ్ల సంబరాలు, 26న మహా శివరాత్రి పురస్కరించుకుని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు చెప్పారు. 27న అమ్మవారి జాతర జరుగుతుందన్నారు. క్యూలైన్లలో భక్తులకు అన్ని సదుపాయాలు కల్పించాలని ఈవో పైలా శేఖర్‌బాబుకు సూచించారు.

వంకర పాదం చికిత్సపై శిక్షణ

మహారాణిపేట, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : పిల్లల్లో వచ్చే క్లబ్ ఫుట్ (వంకర పాదం)కు పోన్సేటి టెక్నిక్ విధానం ద్వారా అందించే చికిత్సపై అమెరికాకు చెందిన వైద్య నిపుణుడు ఆధ్వర్యంలో ఆర్థోపెడిక్ వైద్య విద్యార్థులకు శిక్షణ నిర్వహించారు. అమెరికాకు చెందిన ప్రముఖ ఆర్థోపెడిక్ వైద్య నిపుణుడు బ్రూస్ స్మిత్ కేజీహెచ్‌ను గురువారం సందర్శించారు, ఈ సందర్భంగా ఆయన పిల్లల్లో వచ్చే వంకర పాదం చికిత్స గురించి పీజీ విద్యార్థులకు వివరించారు. అనంతరం డాక్టర్ స్మిత్‌ను కేజీహెచ్ వైద్యులు ఘనంగా సత్కరించారు,

జాతీయ క్రీడల అర్చరీలో గణేష్ మణిరత్నంకు పతకాలు

విశాఖపట్నం స్పోర్ట్సు, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : ప్రతిష్ఠాత్మక జాతీయ క్రీడల్లో అర్చరీ చాంపియన్‌షిప్ టోర్నీలో విశాఖకు చెందిన తిరుమూరు గణేష్ మణిరత్నం ప్రతిభ కనబరిచి రజత, కాంస్య పతకాలు సాధించాడు. డెహ్రాడూన్‌లో గురువారం జరిగిన పురుషుల వ్యక్తిగత కాంపౌండ్ రౌండ్ ఈవెంట్‌లో కాంస్య పతకం సాధించిన గణేష్ మణిరత్నం... మిక్స్‌డ్ కాంపౌండ్ ఈవెంట్‌లో రజత పతకం సొంతం చేసుకున్నాడు.

గాజువాక భూ సమస్య పరిష్కారం

... 5వ పేజీ తరువాయి

తెలియక/వివిధ రకాల వివాదాలతో సుమారు మూడువేల మందికి పైగా దరఖాస్తు చేసుకోలేదు. దాంతో వారంతా ఆందోళన వ్యక్తం చేయడంతో కొత్తగా వచ్చిన కూటమి ప్రభుత్వం... సమస్య పరిష్కారంపై దృష్టి సారించింది. వారం క్రితం రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్‌తో జిల్లా ఎమ్మెల్యేలు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా గాజువాక ఇనాం భూముల ఆక్రమణల క్రమబద్ధీకరణ అంశం చర్చకు వచ్చింది. ఆక్రమణల క్రమబద్ధీకరణకు అనుమతి ఇస్తామని ఇచ్చిన హామీ మేరకు గురువారం మంత్రివర్గం చర్చించి ఆమోదించింది. దీనికి సంబంధించి త్వరలో పూర్తి విధి విధానాలు జారీచేస్తారు. గతంలో పట్టాలు ఇచ్చి కన్వేయన్స్ డీడ్స్ కోసం ఎదురుచూస్తున్న 1800 మందితో పాటు పలు కారణాలతో దరఖాస్తు చేయని సుమారు మూడు వేల మందికి అవకాశం ఇవ్వనున్నారు.

ఆవేదనతో ఉన్న ప్రజలకు ఊరట

- పల్లా శ్రీనివాసరావు, ఎమ్మెల్యే, గాజువాక

గాజువాకలో ఏళ్ల క్రితం ఇళ్లు నిర్మించుకున్న కుటుంబాల ఆవేదనను కూటమి ప్రభుత్వం గుర్తించింది. ఆక్రమణల క్రమబద్ధీకరణకు అవకాశం కల్పించడంతో వారికి ఊరట లభించింది. సమస్య పరిష్కారానికి మూడు దశాబ్దాల నుంచి ప్రజలు పోరాడుతున్నారు. గతంలో జీవో 301 ప్రకారం 5,200 మందికి సీఎం చంద్రబాబు పట్టాలు ఇప్పిస్తే వైసీపీ ప్రభుత్వం వారికి హక్కులు కల్పించలేదు. తిరిగి చంద్రబాబు సీఎంగా బాధ్యతలు తీసుకున్న తరువాత గాజువాక ఆక్రమణలపై స్పందించడం గొప్ప విషయం. గాజువాకలో ఐదు వేల మంది మంది ఆక్రమణదారుల తరపున కూటమి ప్రభుత్వానికి ధన్యవాదాలు.

టెన్త్ పరీక్షల సన్నద్ధతపై డీఈవో ఆరా

అక్కయ్యపాలెం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): శ్రద్ధగా చదివి మంచి మార్కులు సాధించాలని జిల్లా విద్యాశాఖాధికారి ప్రేమ్‌కుమార్ పదో తరగతి విద్యార్థులకు సూచించారు. 26వ వార్డు ఎన్‌జీజీఓస్ కాలనీలోని జీవీఎంసీ ఉన్నత పాఠశాలను గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠ్య ప్రణాళిక అమలవుతున్నదీ, లేనిదీ విద్యార్థులు, ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు.హోం వర్క్ సక్రమంగా చేస్తున్నారా? లేదా? అని ఆరా తీశారు.ఆయా సబ్జెక్టుల పాఠాలను విద్యార్థులతో చదివించారు. పదో తరగతి పరీక్షలలో మంచి ఉత్తీర్ణత సాధించేలా తగు చర్యలు తీసుకోవాలని పాఠశాల హెచ్‌ఎం బి.లక్ష్మీనరసను ఆదేశించారు. సీనియర్ ఉపాధ్యాయుడు ఆర్.శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు మాణిక్యం, ఎ.సునంద్, ఎంఎస్‌వి విశ్వనాథం, కిశోర్, రామలక్ష్మి, నిర్మల ఉన్నారు.

విద్యార్థి ఇంటికి ఉపాధ్యాయులు

కంచరపాలెం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): పాఠశాలకు హాజరుకాని విద్యార్థుల ఇళ్లకు వెళ్లి వారికి కౌన్సెలింగ్ చేసి తిరిగి తరగతులకు హాజరయ్యేలా ఉపాధ్యాయులు చర్యలు తీసుకుంటున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఏ ఒక్క విద్యార్థి మధ్యలో బడి మానేయకూడదనే ఆలోచనతో ఉపాధ్యాయులు ప్రయత్నిస్తూ, అలాంటివారు పాఠశాలలకు వచ్చేలా కృషి చేస్తున్నారు. జీవీఎంసీ ఆర్పీపేట ఉన్నత పాఠశాల్లో పదోతరగతి చదువుతున్న జ్ఞానేశ్వరి అనే బాలిక ఇటీవల పాఠశాలకు హాజరుకావడం లేదు. దీంతో అధికారులు, హెచ్‌ఎం ఆర్.శ్రీనివాసరావు సూచనల మేరకు ఉపాధ్యాయులు బి.పరమేశ్వరరావు, జీవీ జగన్నాథరావులు జ్ఞానేశ్వరి ఇంటికి వెళ్లి తిరిగి పాఠశాలకు వచ్చేలా ఒప్పించారు.

'పింఛన్‌దారులపై కేంద్రం తీరు సరికాదు'



సమావేశంలో పాల్గొన్న సెయిల్ విశ్రాంత ఉద్యోగులు

సీతంపేట, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ద్వారకానగర్‌లోని పౌరగ్రంథాలయంలో సెయిల్ విశ్రాంత ఉద్యోగులు, స్టీల్ ఆథారిటీ విశ్రాంత అధికారులు, ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి వక్తగా విచ్చేసిన ఏపీఆర్ఎ రాష్ట్ర కార్యదర్శి కె.సుధాకర్‌రావు మాట్లాడుతూ ఉద్యోగుల పింఛను పథకం- 95 పేరిట కేంద్రం విశ్రాంత ఉద్యోగుల సంక్షేమానికి సహకరించాల్సింది పోయి వారిని ఇబ్బందులకు గురిచేస్తుందన్నారు. ఉద్యోగుల పీఎఫ్ ద్వారా కూడిన ధనంపై వచ్చే వడ్డీలో మూడో వంతు కేటాయించినా పింఛన్ పెంపు సాధ్యమవుతుందన్నారు. ఈ నెల 11న ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద నిరసన కార్యక్రమం అనంతరం సభ నిర్వహిస్తామన్నారు. సంఘం అధ్యక్షుడు ఆడారి నాగరాజు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ముందుగా ఇటీవల దివంగతులైన విశ్రాంత ఉద్యోగులకు శ్రద్ధాంజలి ఘటించారు.

జాతీయ క్రీడల బీచ్ వాలీబాల్‌లో ఆంధ్రకు స్వర్ణం

విశాఖపట్నం స్పోర్ట్సు, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): జాతీ య క్రీడలు పురుషుల బీచ్ వాలీబాల్ టోర్నీలో ఆంధ్రప్రదేశ్ స్వర్ణ పతకం సాధించింది. విశాఖకు చెందిన మణికంఠరాజు, ఎల్.దివ్యసాయి అద్భుతమైన ఆటతీరును ప్రదర్శించి రాష్ట్రానికి స్వర్ణ పతకాన్నందించారు. డెహ్రాడూన్‌లో గురువారం జరిగిన ఫైనల్స్‌లో ఆంధ్ర 25-23, 21-19 (2-0) స్ట్రెయిట్ సెట్‌లలో తమిళనాడుపై విజయం సాధించింది. హోరాహోరీగా సాగిన ఈ మ్యాచ్‌లో తమిళనాడు ఆటగాళ్లు వివేక్, వెంకట్‌ల నుంచి గట్టి పోటీని ఎదుర్కొన్న ఆంధ్ర ఆటగాళ్లు మణికంఠ, దివ్యసాయి అనూహ్యంగా రాణించి వరుస రెండు సెట్‌లలో ఓడించి పసిడి పతకం చేజిక్కించుకున్నారు.

గణబాబు అభినందన

ప్రతిష్ఠాత్మక జాతీయ క్రీడల బీచ్ వాలీబాల్ టోర్నీలో పురుషుల జట్టు స్వర్ణ పతకం సాధించడంపై రాష్ట్ర వాలీబాల్ సంఘం అధ్యక్షుడు, ప్రభుత్వ విప్ గణబాబు హర్షం ప్రకటించారు. జట్టులో అద్భుతంగా రాణించి రాష్ట్రానికి స్వర్ణ పతకాన్ని అందించిన మణికంఠరాజు, దివ్యసాయిలతో పాటు జట్టుకు కోచ్‌గా వ్యవహరించిన రక్షణకుమార్‌ను అభినందించారు.

ప్రభుత్వ ఐటీఐలో టెక్ కార్నర్ ఏర్పాటు

కంచరపాలెం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): కంచరపాలెం ప్రభుత్వ పాత ఐటీఐలో గురువారం టెక్ కార్నర్‌ను ఏర్పాటు చేశారు. దీనిని ఐటీఐ ప్రిన్సిపాల్ జె.శ్రీకాంత్, సిబ్బంది ప్రారంభించారు. టెక్ కార్నర్ ఏర్పాటుతో ప్రధాన ట్రేడులు డీజిల్ మెకానిక్, మోటారు మెకానిక్, ఎలక్ట్రికల్ ట్రేడుల్లో అధునాతన సాంకేతిక విద్యను అందించడంతో పాటు శిక్షణ ఇవ్వనున్నట్టు ప్రిన్సిపాల్ తెలిపారు. మహేంద్ర & మహేంద్రవారి సహకారంతో ఐటీఐలో ఈ కార్నర్‌ను ప్రారంభించామన్నారు. నూతనంగా ఏర్పాటు చేసిన టెక్ కార్నర్ ల్యాబ్ నుంచి శిక్షణ పొందే అభ్యర్థులు నేరుగా ఆన్‌లైన్ తరగతులను కూడా వీక్షించడానికి అవకాశం ఉంటుందని సెంటర్ ఫౌండేషన్ ప్రతినిధి నవీన్ పేర్కొన్నారు. కంపెనీ ద్వారా ప్రభుత్వ ఐటీఐలో శిక్షణ పొందుతున్న పేద విద్యార్థుల సౌలభ్యం కోసం తమ కంపెనీ స్మార్ట్ టీవీ, అత్యాధునికమైన టూల్ కిట్‌ను అందించిందన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని నాణ్యమైన శిక్షణ పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ వై.ఉమాశంకర్, ట్రైనింగ్ ఆఫీసర్ జె.సత్యనారాయణ, వి.శ్రీనివాసరావు, ట్రైనర్ జె.బాలమురళీ పాల్గొన్నారు.

ఉరి వేసుకొని యువకుడి ఆత్మహత్య

ఎంవీపీ కాలనీ, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక అప్పుఘర్ సమీపంలోని శ్రీకృష్ణ పీజీ బాయ్స్ హాస్టల్‌లో ఓ యువకుడు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎంవీపీ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కడప జిల్లా బద్వేల్ మండలంలోని వెంటకశెట్టి పల్లి సమీపంలోని రాజుపాలేనికి చెందిన వెలిగండ్ల కార్తీక్ రాజు (22) విజయనగరంలోని ఏవీజీఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఇంజనీరింగ్ పూర్తి చేశాడు. అనంతరం ఓ కంపెనీలో కోర్సు చేసి ఇంటర్వ్యూకు హాజరయ్యాడు. కొద్ది రోజుల తర్వాత ఉద్యోగంలో జాయిన్ కావాలంటూ ఫోన్ కాల్ రావడంతో మైక్రోగ్రిడ్ సాఫ్ట్‌వేర్ కంపెనీలో గత నెల 31న చేరాడు. అప్పటి నుంచి నగరంలోని శ్రీకృష్ణ పీజీ బాయ్స్‌లో ఉంటున్నాడు. అయితే బుధవారం ఉదయం నుంచి హాస్టల్ గది నుంచి బయటకు రాలేదు. అనుమానం వచ్చిన హాస్టల్ నిర్వాహకులు అతడు ఉంటున్న గది తలుపులు తెరచి చూడగా ఫ్యానుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకొని కనిపించాడు. దీంతో వసతిగృహం నిర్వాహకులు ఎంవీపీ కాలనీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. మృతుడి తండ్రి నాగరాజు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రైవేటు కళాశాల బరితెగింపు

... 5వ పేజీ తరువాయి

ఒప్పందం కుదుర్చుకున్నారు. ఇక్కడ తరగతులు చెబుతూ...విజయకృష్ణ కాలేజీ పేరుతో విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇస్తున్నారు. ఇందుకుగాను ఒక్కో విద్యార్థి నుంచి రూ.లక్ష నుంచి రూ.లక్షన్నర వరకూ వసూలు చేస్తున్నారు. అంతేకాకుండా కోర్సులు పూర్తిచేసిన విద్యార్థులకు పదవ, ఇంటర్ సర్టిఫికెట్లు తిరిగి ఇవ్వడానికి మరో రూ.10 వేలు నుంచి రూ.20 వేలు వరకు డిమాండ్ చేస్తున్నారు. ఈ ఏడాది నర్సింగ్ కోర్సు పూర్తిచేసిన విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వడానికి కళాశాల యాజమాన్యం డబ్బులు డిమాండ్ చేసింది. దీంతో విద్యార్థులు ఇంటర్మీడియట్ బోర్డు ప్రాంతీయ అధికారి (ఆర్ఐవో) మురళీధర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు బుధవారం తనిఖీకి వెళ్లిన బోర్డు అధికారులు కళాశాల నిర్వహణ చూసి ఖంగుతిన్నారు. అనుమతి పొందిన చిరునామాలో కాకుండా వేరే భవనంలో కళాశాల నిర్వహిస్తున్నట్టు, ఒకేషనల్ కళాశాల అనుమతి పొంది నర్సింగ్ కోర్సులు బోధిస్తున్నట్టు గుర్తించారు. మొదట అంతస్థులో షాపింగ్ మాల్, రెండో అంతస్థులో చర్చి ఉండగా...మూడో అంతస్థులో జూనియర్ కళాశాల, ఆపై అంతస్థులో అనధికారికంగా వసతి గృహం నిర్వహిస్తుండడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. అనుమతి లేని భవనంలో కళాశాల, నర్సింగ్ కోర్సులు ఎందుకు నిర్వహిస్తున్నారో తెలపాలని యాజమాన్యానికి ఆర్ఐవో మురళీధర్ నోటీసులు ఇచ్చారు. ఆర్ఐవో నోటీసులకు కళాశాల నిర్వాహకులు స్పందించకపోగా విద్యార్థులకు సర్టిఫికెట్లు కూడా ఇవ్వలేదు. దీంతో ఆర్ఐవో గురువారం మరో రెండు దఫాలు నోటీసులిచ్చారు. వాటికి కూడా స్పందించకపోవడంతో కళాశాలపై చర్యలు తీసుకోవడానికి అనుమతివ్వాలని కోరుతూ ఇంటర్ బోర్డు కమిషనర్‌కు లేఖ రాశారు. ఇదిలావుండగా ఆర్ఐవో ఆదేశించినా సర్టిఫికెట్లు ఇవ్వకపోవడంతో విద్యార్థులు గురువారం జిల్లా కలెక్టర్, పోలీస్ కమిషనర్, రెండో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేయకుండా ఆర్ఐవోను సంప్రతించి కళాశాల సీజ్ చేయాలని సూచించారు. కలెక్టర్ కూడా చర్యలు తీసుకోవాలని ఆర్ఐవోకి ఆదేశించగా పరీక్షల సమయంలో కళాశాల సీజ్ చేస్తే విద్యార్థులు రోడ్డున పడతారని ఆయన వివరించారు.

పరీక్షలు ముగియగానే చర్యలు

- మురళీధర్, ఆర్ఐవో

విశాఖ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో సర్టిఫికెట్లు ఇవ్వడానికి డబ్బులు డిమాండ్ చేస్తున్నట్టు విద్యార్థులు ఫిర్యాదు చేశారు. వారికి ధ్రువపత్రాలు ఇచ్చేయాల్సిందిగా యాజమాన్యాన్ని ఆదేశించినా పట్టించుకోలేదు. దీంతో విద్యార్థులు పోలీస్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. అనుమతి లేని భవనంలో కళాశాల నిర్వహించడమే కాకుండా నర్సింగ్ కోర్సులు నిర్వహిస్తున్నారు. దీనిపై కళాశాల యాజమాన్యానికి నోటీసులిచ్చాం. వారి నుంచి సంతృప్తికరమైన సమాధానం లేనందున చర్యలకు కమిషనర్‌కు లేఖ రాశాం. విద్యార్థుల భవిష్యత్ దృష్ట్యా పరీక్షలు ముగియగానే కళాశాలపై చర్యలు తీసుకుంటాము.

పుంజుకున్న రిజిస్ట్రేషన్లు

... 5వ పేజీ తరువాయి

డాక్యుమెంట్లు దాఖలవుతాయని, దాంతో మంచి ఆదాయం వస్తుందని అధికారులు చెబుతున్నారు.

రూ.వేయి కోట్లు సాధిస్తాం

ప్రభుత్వం విశాఖపట్నం జిల్లాలో రియల్ ఎస్టేట్ లావాదేవీలను బట్టి 2024-25 ఆర్థిక సంవత్సరానికి రూ.1,526 కోట్ల ఆదాయం లక్ష్యంగా ఇచ్చింది. ఎన్నికల సంవత్సరం కావడం, ప్రభుత్వం మారితే విశాఖ కేంద్రంగా పరిపాలనా రాజధాని ఉంటుందా? లేదా? అనే అనుమానాలు ఉండడం వల్ల కొన్ని నెలల పాటు లావాదేవీలు తగ్గిపోయాయి. కొత్త ప్రభుత్వం వచ్చాక...పరిస్థితులపై అవగాహన పెంచుకున్న రియల్ ఎస్టేట్ వ్యాపారులు, ప్రజలు మళ్లీ ఆసక్తి చూపిస్తున్నారు. ప్రతి ఏటా ఫిబ్రవరి, మార్చి నెలల్లో రిజిస్ట్రేషన్లు అధికంగానే ఉంటాయి.



ఇప్పటి వరకు రూ.716.59 కోట్లు ఆదాయం వచ్చింది. మార్చి నెలాఖరుకు వేయి కోట్ల మార్కు దాటేస్తాం. జిల్లాలోని మొత్తం తొమ్మిది కార్యాలయాల ఆదాయం పరిశీలిస్తే భీమునిపట్నం, ద్వారకానగర్, గోపాలపట్నం కార్యాలయాలు మాత్రమే అంతకు ముందు ఏడాది కంటే తక్కువ ఆదాయంలో ఉన్నాయి. మిగిలిన ఆరు కార్యాలయాలు ఎక్కువ ఆదాయం సాధించాయి. మొత్తంగా చూసుకుంటే గత ఏడాది జనవరి నెలాఖరుకు ఇప్పటికీ బేరీజు వేసుకుంటే 3.29 శాతం వృద్ధి సాధించాము.

- ఉపేంద్రరావు, జిల్లా రిజిస్ట్రార్

పూర్ణామార్కెట్‌లో బినామీ దందా

... 5వ పేజీ తరువాయి

ప్లాస్టిక్ ప్రత్యామ్నాయ బ్యాగ్‌ల విక్రయం నిలిచిపోయింది. మార్కెట్‌లో బినామీ పేర్లతో అనేక దుకాణాలను చేజిక్కించుకున్న ఓ దళారీ ఇటీవల దానిముందుఒకరితో దుకాణం పెట్టించి రోజుకి రూ.200 అద్దె వసూలు చేస్తున్నారు. బినామీ పేర్లతో దుకాణాలను కొంతమంది చేజిక్కించుకుంటున్న విషయం జీవీఎంసీ జోన్-4 అధికారులకు తెలిసినప్పటికీ చర్యలు తీసుకోవడానికి మాత్రం ముందుకురావడం లేదని వ్యాపారులు వాపోతున్నారు.అధికారులకు వాటాలు అందుతుండడంతో ఏమీ తెలియనట్టు వ్యవహరిస్తున్నారని అనుమానం వ్యక్తంచేస్తున్నారు. మార్కెట్‌లో దందా చేస్తున్న మరొకరు ఐదు దుకాణాలను చేతిలోపెట్టుకుని అద్దెలకు ఇస్తున్నాడని, పైగా మార్కెట్‌లో ఉన్న సులభ్ కాంప్లెక్స్ నిర్వహణను ఒక మహిళకు అప్పగించి, ఆమె నుంచి నెలకు రూ.ఐదు వేలు కమీషన్ తీసుకుంటున్నట్టు వ్యాపారులు ఆరోపిస్తున్నారు. ఆశీల్ వసూలు నుంచి, దుకాణాలను బినామీ పేర్లతో గుప్పిట్లో పెట్టుకోవడం వరకూ అనేక ఉల్లంఘనలు ఉన్నాయి. పూర్ణామార్కెట్ ప్రక్షాళనకు జీవీఎంసీ ఉన్నతాధికారులు ఇప్పటికైనా నడుంబిగిస్తారో లేదో చూడాలి.

ఉక్కు ఉద్యోగులకు అధిక పెన్షన్

... 5వ పేజీ తరువాయి

ఫలితం లేకపోవడంతో ఉద్యోగ సంఘాల నాయకులు విశాఖ ఎంపీ శ్రీభరత్‌ను, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావును కలిసి సమస్య వివరించారు. దీనిపై ఎంపీ శ్రీభరత్...కేంద్ర కార్మిక శాఖా మంత్రి మనసుఖ్ మాండవీయను కలిసి పెన్షన్లు విడుదల చేయాలని కోరారు. ఆలస్యానికి కారణాలు తెలుసుకొని ఢిల్లీలో ఈపీఎఫ్‌ఓ కార్యాలయంపై ఒత్తిడి పెట్టారు. ఇక్కడ స్టీల్ ప్లాంటు రీజనల్ కార్యాలయంలో పల్లా శ్రీనివాసరావు తరచూ సమీక్షలు నిర్వహించి పెన్షన్లు మంజూరుకు యత్నించారు. వీరిద్దరి కృషి ఫలితంగా అధిక పెన్షన్లకు అడ్డంకులన్నీ తొలగిపోయాయి. దీంతో ఐదు వేల మందికి ప్రయోజనం కలిగింది. దీంతో విశాఖ ఉక్కు ఉద్యోగ వర్గాలన్నీ ఎంపీ శ్రీభరత్‌కు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుకు కృతజ్ఞతలు తెలిపారు. ప్లాంటుకు సంబంధించిన సమస్యలపై సకాలంలో స్పందించి పరిష్కరిస్తున్నందుకు ధన్యవాదాలు తెలిపారు.

ప్రభుత్వ భూముల పరిరక్షణకు పటిష్ఠ చర్యలు

... 5వ పేజీ తరువాయి

నీటి ప్రవాహ ప్రాంతాల్లో ఆక్రమణలు, యూఎల్‌సీ భూముల పరిరక్షణ, రెవెన్యూ రికార్డుల నిర్వహణ, 22-ఎ డీనోటిఫికేషన్, ఆర్‌వోఆర్ అప్పీళ్లు, కోర్టు కేసులు, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో వచ్చిన అర్జీల పరిష్కారం తదితర అంశాలపై పలు సూచనలు చేశారు. గ్రామ సభల్లో వచ్చిన వినతుల పరిష్కారంపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి బీహెచ్ భవానీశంకర్, భీమిలి ఆర్డీవో సంగీత్‌మాధుర్, ప్రత్యేక ఉప కలెక్టర్లు, తహసీల్దార్లు, సెక్షన్ సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.

గర్భం దాల్చిన వసతి గృహం విద్యార్థిని!

పోలీసుల అదుపులో యువకుడు ?

భీమునిపట్నం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): భీమిలిలోని బీసీ కళాశాల బాలికల వసతి గృహంలో ఉంటున్న విద్యార్థి ఒకరు గర్భవతి కావడం కలకలం రేపింది. సీఐ సుధాకర్ తెలిపిన వివరాలు ప్రకారం...

అనకాపల్లి జిల్లాకు చెందిన ఒక బాలిక (17) భీమిలిలోని డిగ్రీ కళాశాలలో ప్రథమ సంవత్సరం చదువుతోంది. బీచ్‌రోడ్డులో ఉన్న ప్రభుత్వ బాలికల వసతి గృహంలో ఉంటోంది. అదే గ్రామానికి చెందిన యువకుడు (18) మధురవాడలో గల ఇంజనీరింగ్ కళా శాలలో బీటెక్ ప్రథమ సంవత్సరం చదువుతున్నాడు. ఇద్దరూ కొంతకాలంగా ప్రేమించుకుంటున్నారు. శారీరకంగా ఒక్కటయ్యారు. ఈ క్రమంలో బాలిక గర్భం దాల్చింది. గర్భం పోయేందుకు ఏవో టాబ్లెట్లు వేసుకోవడంతో తీవ్ర రక్తస్రావమైంది. దీంతో గురువారం ఇద్దరూ కేజీహెచ్‌కు వెళ్లారు. పరీక్షించిన వైద్యులు బాలిక మైనర్ కావడంతో వివరాలు ఆరా తీసి, భీమిలి పోలీసులకు సమాచారం ఇచ్చారు. కాగా బాలికకు తీవ్ర రక్తస్రావం అవుతుండడంతో వైద్యులు అబార్షన్ చేశారు. ఆ యువకుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ విషయమై సంబంధిత హాస్టల్ మేట్రిన్ భారతితోను, భీమిలి అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ జ్యోతిశ్రీతో మాట్లాడడానికి యత్నించగా వారు ఫోన్‌కు అందుబాటులో లేరు.

రసాయనాలు వాడకుండా సాగు సాధ్యమే..



సమావేశంలో శ్రీలంక ప్రతినిధి బృందం

విశాఖపట్నం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయ సూత్రాలను అనుసరించడం ద్వారా రసాయనాలు వినియోగించకుండా వ్యవసాయం చేయడం సాధ్యమేనని శ్రీలంక ప్రతినిధి బృందం, రైతులు అభిప్రాయపడ్డారు. రైతుసాధికార సంస్థ రాష్ట్రంలో అమలుచేస్తున్న ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ మేనేజ్డ్ నేచురల్ ఫార్మింగ్ నమూనాను శ్రీలంక ప్రతినిధి బృందం గురువారం ఆసక్తిగా తిలకించింది. నగరంలోని ఒక ప్రైవేటు హోటల్‌లో రైతుసాధికార సంస్థ ఏర్పాటు చేసిన సమావేశంలో ఈ బృందం పాల్గొంది. రాష్ట్రంలో 11 రోజులు పర్యటించిన బృందం తమ అనుభవాలను రైతుసాధికార సంస్థ ప్రతినిధులతో పంచుకుంది. శ్రీలంక సర్వోదయ ఫౌండేషన్ ప్రతినిధి చమారి మాట్లాడుతూ శ్రీలంకలో కూడా ప్రకృతి వ్యవసాయం చేసేందుకు రైతులు ఉత్సాహం చూపుతున్నారన్నారు. రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్‌చైర్మన్ టి.విజయ్‌కుమార్ సమావేశంలో వర్చువల్‌గా పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **తండేల్:** జగదాంబ, సంగం, కామేశ్వరి, శ్రీరామ, శ్రీవెంకటేశ్వర, శ్రీలీలామహల్, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ(గోపాలపట్నం), మోహిని (గాజువాక), అన్నపూర్ణ(కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ),
- **భవానీ వార్డ్:** జగదాంబ, రమాదేవి
- **మదగజరాజ:** జగదాంబ, వెంకటేశ్వర-1, సౌజన్య (గోపాలపట్నం), శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా),
- **సంక్రాంతికి వస్తున్నాం:** శారద, మెలోడి, జగదాంబ, కిన్నెర, కాంతి, శ్రీలక్ష్మీనరసింహ-1,2 (104 ఏరియా), శ్రీనరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), తాతా, రాములమ్మ (తగరపువలస)
- **డాకు మహారాజ్:** శరత్, శ్రీకన్య, కిన్నెర, సుకన్య, మోహిని కాంప్లెక్స్, శ్రీకన్య హెవెన్ (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), గణేష్, సప్తగిరి (తగరపువలస)
- **గేమ్ ఛేంజర్:** మెలోడి, సంగం, కామేశ్వరి, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), కన్యకాంప్లెక్స్, మోహిని కాంప్లెక్స్ (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-2 (పెందుర్తి) రాములమ్మ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 30, టమాటా 13, వంకాయలు (తెలుపు)20, వంకాయలు (నలుపు) 26, బెండకాయలు 44, పచ్చిమిర్చి 34, కాకరకాయలు 42, బీరకాయలు 50, ఆనపకాయ 12, కాలీఫ్లవర్ 12, క్యాబేజి 12, క్యారెట్ 26 దొండకాయలు 32, బంగాళ దుంపలు 16, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 100, అల్లం (పాతది)44, బరబాటి 30, ముల్లంగి 20, నిమ్మకాయలు (కిలో) 62, బద్దచిక్కుడు 30, దోస కాయలు 26, వెల్లుల్లి (పెద్దవి) 160, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 38, కీరదోస 32, కాప్సికమ్ 42, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 40 చిలగడదుంపలు 38, కంద 56, దేముడు చిక్కుడు 32, గోరు చిక్కుడు 26, కూర పెండలం 26, బ్రకోలి 55 , నూల్‌కోల్ 30, పనసపొట్టు 200, కొండఉసిరి 70, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్దకట్ట) 25, పుదీన (కట్ట) 4, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 120, బూడిద గుమ్మడి కాయ 30, కర్రపెండలం 20, మామిడి అల్లం 46, బొప్పాయి 38, జామకాయలు (కిలో) 60.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)

విశాఖపట్నం	470
విజయనగరం	474
శ్రీకాకుళం	474

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	100
లైవ్ ధర	120
విత్ స్కిన్	210
స్కిన్‌లెస్	220

ఇ-శ్రమ్ కార్డుతో శ్రమజీవులకు ఆర్థిక భరోసా



మద్దిలపాలెం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : సామాన్య, మధ్యతరగతి ప్రజలకు కేంద్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అందిస్తోంది. అందులో చాలామందికి కొన్నింటిపైనే అవగాహన ఉంటుంది. మరికొన్ని పథకాలు గురించి పూర్తిగా అవగాహన లేకపోవడంతో ప్రయోజనం పొందలేకపోతున్నారు. అందులో ఒకటి ఇ-శ్రమ్ కార్డు. కేంద్రం అందిస్తున్న ఈ కార్డు శ్రమజీవులకు ఆర్థిక వనరుగా చెప్పుకోవచ్చు.

రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ఇ-శ్రమ్ పోర్టల్ రాష్ట్ర స్థాయి మానిటరింగ్ సమావేశం నిర్వహించింది. రాష్ట్రంలో అసంఘటిత రంగంలో పని చేస్తున్న 1.5 కోట్ల మంది కార్మికుల వరకు ఇ-శ్రమ్ పోర్టల్‌లో నమోదు చేయాలని లక్ష్యంగా నిర్ణయించారు. దీంతో తూర్పు నియోజకవర్గంలో అసంఘటిత కార్మికులను ఇ-శ్రమ్ పోర్టల్‌లో నమోదు ప్రక్రియ ప్రారంభించారు.



కార్మిక శాఖ అధికారులు, సచివాలయ సిబ్బంది, కార్మిక సంఘాల నేతలు అర్హులైన కార్మికులను నమోదు చేస్తున్నారు. అయితే తూర్పులో దాదాపు 25 వేల మంది అసంఘటిత కార్మికులు ఉన్నట్టు అంచనా. వీరిలో ఇప్పటికే సుమారు 15 వేల మంది వరకు ఇ-శ్రమ్ కార్డుల నమోదు చేసినట్టు కార్మిక సంఘం నేతలు వెల్లడించారు.

ఇ-శ్రమ్ కార్డుల ప్రయోజనాలు...

ఇ-శ్రమ్ కార్డులు తీసుకున్న కార్మికులు దురదృష్టవశాత్తూ ప్రమాదానికి గురై పాక్షిక వికలాంగులుగా మారితే బీమా కింద రూ.లక్ష సహాయ లభిస్తుంది. శాశ్వత వైకల్యం, లేదా మరణిస్తే వారి కుటుంబానికి రూ2 లక్షల బీమా లభిస్తుంది. అంతేకాకుండా ఈ కార్డులు పొందిన కార్మికులకు కేంద్ర ప్రభుత్వం అమలు చేసే అనేక పథకాల ద్వారా ప్రయోజనాలు అందుకునే అవకాశం ఉంది.

ఎవరు అర్హులంటే..?

ఈ కార్డును ఇ-శ్రమ్ వెబ్‌సైట్‌లో లాగిన్ అయి నమోదు చేసుకోవాలి. 18 నుంచి 59 ఏళ్ల వయసు వారు ఆధార్ కార్డు, విద్యార్హతలు, పని స్వభావం, ఫోన్ నంబర్, బ్యాంక్ వంటి వివరాలు నమోదు చేయాలి. ఇ-శ్రమ్ కార్డు నమోదుకు పరిశ్రమల్లో పని చేసే కార్మికులు, రోజువారీ కూలీలు, వీధి వ్యాపారులు, భవన నిర్మాణరంగ కార్మికులు, ఇంటి పని వాళ్లు, అర్హులు. రూ.పది హేను వేలు కంటే ఎక్కువ జీతం, పీఎఫ్, ఈఎస్ఐ, ఆదాయపు పన్ను చెల్లించే కార్మికులు అనర్హులు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. వెబ్‌సైట్ :
https://register.eshram.gov.in/#/ user/self

అతిపెద్ద ప్రజాస్వామ్య సాధనంగా సోషల్ మీడియా

» సీనియర్ సంపాదకులు కె.శ్రీనివాస్



కార్యక్రమంలో ప్రసంగిస్తున్న సీనియర్ సంపాదకులు కె.శ్రీనివాస్

విశాఖపట్నం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : అతిపెద్ద ప్రజాస్వామ్య సాధనంగా సామాజిక మాధ్యమం (సోషల్ మీడియా) నిలుస్తోందని సీనియర్ సంపాదకులు కె.శ్రీనివాస్ అన్నారు. 'మిత్రసాహితీ' సంస్థ ఆధ్వర్యంలో గురువారం పౌర గ్రంథాలయంలో నిర్వహించిన 'జర్నలిజం- వెలుగు నీడలు' అంశంపై నిర్వ హించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సామాజిక మాధ్యమంలో స్వేచ్ఛగా భావవ్యక్తీకరణకు అవకాశం లభిస్తోందని, కొన్ని సందర్భాల్లో ఎక్కువగా అసత్యం వ్యాప్తి చెందుతోందన్నారు. ప్రజల్లో తెలుసుకోవాలన్న ఆసక్తి లేకపోవడంతోనే ఇన్వెస్టిగేటివ్ జర్నలిజానికి ఆస్కారం లేకుండా పోయిందన్నారు. దేశంలో ప్రముఖ మీడియా సంస్థలు మోదీ గుప్పెట్లోకి వెళ్లిపోయి నిర్వీర్యం అయిపోయాయన్నారు. చాలావరకూ అంబానీ, అదానీ చేతుల్లో ఉన్నాయన్నారు. ఈ నేపథ్యంలో అత్యధి కులు సామాజిక మాధ్యమాలను వినియోగిస్తున్నారన్నారు. గతంతో పోలిస్తే జర్నలిజంలో ఒత్తిడి పెరిగిందన్నారు. ప్రజల్లో సమ్మతి, అసమ్మతిని సృష్టించడంలో మీడియా కీలకపాత్ర పోషిస్తుందని, సమాజానికి, మీడియాకు మధ్య దూరాన్ని గుర్తించి భర్తీ చేసే దిశగా న్యూ మీడియాతో వచ్చేందుకు యత్నిస్తున్నామని వెల్లడించారు.

బిజినెస్ లైన్ అసోసియేట్ ఎడిటర్ కేవీ కూర్మనాథ్ సామాజిక మాధ్యమాల వినియోగంలో ఏఐ సహా అధునాతన సాంకేతికత తీసుకువచ్చిన మార్పుల గురించి వివరించారు. మిత్రసాహితీకి చెందిన ప్రసాదవర్మ అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న లీడర్ పత్రిక ఎడిటర్ వీవీ రమణమూర్తి మాట్లాడారు.

జాతీయ క్రీడల బీచ్ వాలీబాల్‌లో ఆంధ్రకు స్వర్ణం

విశాఖపట్నం స్పోర్ట్సు, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): జాతీయ క్రీడలు పురుషుల బీచ్ వాలీబాల్ టోర్నీలో ఆంధ్రప్రదేశ్ స్వర్ణ పతకం సాధించింది. విశాఖకు చెందిన మణికంఠరాజు, ఎల్.దివ్యసాయి అద్భుతమైన ఆటతీరును ప్రదర్శించి రాష్ట్రానికి స్వర్ణ పతకాన్నందించారు. డెహ్రాడూన్‌లో గురువారం జరిగిన ఫైనల్స్‌లో ఆంధ్ర 25-23, 21-19 (2-0) స్ట్రెయిట్ సెట్లలో తమిళనాడుపై విజయం సాధించింది. హోరాహోరీగా సాగిన ఈ మ్యాచ్‌లో తమిళనాడు ఆటగాళ్లు వివేక్, వెంకట్‌ల నుంచి గట్టి పోటీని ఎదుర్కొన్న ఆంధ్ర ఆటగాళ్లు మణికంఠ, దివ్యసాయి అనూహ్యంగా రాణించి వరుస రెండు సెట్‌లలో ఓడించి పసిడి పతకం చేజిక్కించుకున్నారు.

ఉరి వేసుకొని యువకుడి ఆత్మహత్య

ఎంవీపీ కాలనీ, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక అప్పుఘర్ సమీపంలోని శ్రీకృష్ణ పీజీ బాయ్స్ హాస్టల్‌లో ఓ యువకుడు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎంవీపీ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కడప జిల్లా బద్వేల్ మండలంలోని వెంటకశెట్టి పల్లి సమీపంలోని రాజుపాలేనికి చెందిన వెలిగండ్ల కార్తీక్ రాజు (22) విజయనగరంలోని ఏవీజీఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఇంజనీరింగ్ పూర్తి చేశాడు. అనంతరం ఓ కంపెనీలో కోర్సు చేసి ఇంటర్వ్యూకు హాజరయ్యాడు. కొద్ది రోజుల తర్వాత ఉద్యోగంలో జాయిన్ కావాలంటూ ఫోన్ కాల్ రావడంతో మైక్రోగ్రిడ్ సాఫ్ట్‌వేర్ కంపెనీలో గత నెల 31న చేరాడు. అప్పటి నుంచి నగరంలోని శ్రీకృష్ణ పీజీ బాయ్స్‌లో ఉంటున్నాడు. అయితే బుధవారం ఉదయం నుంచి హాస్టల్ గది నుంచి బయటకు రాలేదు. అనుమానం వచ్చిన హాస్టల్ నిర్వాహకులు అతడు ఉంటున్న గది తలుపులు తెరచి చూడగా ఫ్యానుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకొని కనిపించాడు. దీంతో వసతిగృహం నిర్వాహకులు ఎంవీపీ కాలనీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. మృతుడి తండ్రి నాగరాజు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గౌరవప్రద భారతదేశ నిర్మాణమే లక్ష్యం

» ప్రొఫెసర్ సత్యపాల్
» మూవ్‌మెంట్ క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రొఫెసర్ సత్యపాల్, మూమెంట్ ప్రతినిధులు

వెంకోజీపాలెం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : దేశాన్ని గౌరవప్రద భారతదేశంగా నిర్మించటానికి దేశ వ్యాప్తంగా పనిచేస్తున్న మూవ్‌మెంట్ 21 (21 శతాబ్దపు ఉద్యమం) క్యాలెండర్ 2025 ను గురువారం ఏయూ ఆర్ట్స్ కళాశాల ఆంత్రోపాలజీ ప్రొఫెసర్ పి.డి.సత్యపాల్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మూమెంట్ సభ్యులు డాక్టర్ బోరుగడ్డ సుబ్బయ్య మాట్లాడుతూ భారతదేశ రాజ్యాంగ విలువలైన స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం, సమన్యాయం కమిటీలతో కూడిన ప్రజాస్వామ్య సమాజాన్ని, పర్యావరణహిత భారతదేశాన్ని, సామాజిక రాజకీయ ఆర్థిక అంతరాలు లేని సమ సమాజాన్ని ఏర్పాటు చేయటానికి మూవ్‌మెంట్ 21 పనిచేస్తుందన్నారు. ఈ క్యాలెండర్‌లో దేశం కోసం ప్రాణ త్యాగాలు చేసి చరిత్ర మరిచిన చారిత్రక హీరోలు ఎందరో మన దేశ మహానుభావుల జీవితాలలో ముఖ్య ఘట్టాలను పొందుపరచడం జరిగిందన్నారు. ఈ క్యాలెండర్ చూసినప్పుడల్లా సామాజిక స్పృహ కలిగి తరతరాలుగా మానసిక రుగ్మతులై దేశాన్ని పట్టి పీడిస్తున్న కులాన్ని పితృసౌమ్య వ్యవస్థను నాశనం చేయటానికి ప్రతి భారతీయులు బాధ్యతతో మెలగాలన్నారు. కార్యక్రమంలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఆంత్రోపాలజీ హెడ్ డాక్టర్ రమేష్, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎన్.శ్రీనివాస్, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ మెమోరియల్ సొసైటీ విశాఖ ప్రధాన కార్యదర్శి జేవీ ప్రభాకర్, డాక్టర్ ఎంఈఎస్ఎస్ ప్రకాశ్‌రావు, డాక్టర్ ముళ్ల అబ్దుల్ జులిఫిర్, మూవ్‌మెంట్ 21 కేంద్ర సభ్యులు డాక్టర్ మృత్యుంజయ్, వరసల మిలింద్‌కుమార్ పాల్గొన్నారు.

పుష్పాలంకరణలో వేంకటేశ్వరస్వామి



ఎంవీపీ కాలనీ, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : ఎంవీపీ కాలనీ ఆరో సెక్టరులోని శ్రీ వేంకటేశ్వరస్వామి, ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. మంగళవారం ప్రారంభమైన ఉత్సవాలు ఈ నెల 9 తేదీ వరకూ నిర్వహించనున్నారు. గురువారం వేంకటేశ్వర స్వామికి నిత్యాపూర్ణాహుతి, వివిధ రకాల పరిమళ పుష్పార్చన నిర్వహించారు. భారీగా భక్తులు పాల్గొన్నారు. శుక్రవారం గాగశాలార్చన 30వ ప్రతిష్ఠా వార్షిక కళ్యాణం, శనివారం తులసీదళార్చన, పండిత సదస్యం, ఆదివారం కుంభప్రోక్షణం అలాగే ఈ నెల 12న శ్రీ ఉమారాలింగేశ్వరస్వామివారి 41వ ప్రతిష్ఠా వార్షిక కళ్యాణమహోత్సవం నిర్వహించనున్నట్లు నిర్వాహక సంస్థ శ్రీమదుభయ వేదాంతాచార్య పీఠం తెలిపింది.

నేడు, రేపు పలు ప్రాంతాల్లో తాగునీటి సరఫరాకు అంతరాయం

వెంకోజీపాలెం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : కృష్ణాపురం హెడ్ వాటర్ పంపు హౌస్ మరమ్మతుల కారణంగా జీవీఎంసీ జోన్-8 పరిధిలోని పలు ప్రాంతాలకు శుక్రవారం, శనివారం తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని మంచినీటి సరఫరా విభాగం కార్యనిర్వాహక ఇంజనీరు బి.మురళీకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. కృష్ణాపురం హెడ్ వాటర్ పంప్ హౌస్ మరమ్మతుల నిమిత్తం ఫిబ్రవరి 7 శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి ఫిబ్రవరి 8 శనివారం ఉదయం 10 గంటల వరకు మంచినీటి సరఫరాను పూర్తిగా నిలిపి వేయడం జరుగుతుందన్నారు.

తాటిపూడి ప్రధాన పైపులైన్ పైన ఉన్న మంచినీటి సరఫరా బల్క్ (రెసిడెన్షియల్), ఇండస్ట్రీస్ వినియోగదారులకు, జోన్-8 పరిధిలో ఉన్న వార్డు 93(పి) నుంచి వార్డు-98లో గల ప్రాంతాలైన సాయిదుర్గానగర్, దుర్గానగర్, కృష్ణానగర్, అప్పలనరసింహం కాలనీ, వెంకటసాయి నగర్, బంటాకాలనీ, రవినగర్, లక్ష్మీపురం, పోర్టు కాలనీ, రామ కోఆపరేటివ్ కాలనీ, హెచ్‌బీ కాలనీ(గోకులం కాలనీ), రెల్లి వీధి, కృష్ణరాయపురం, గొల్లివిల్లివానిపాలెం, ఎల్ఐసీకాలనీ, సుజాతనగర్, పాపయ్య రాజుపాలెం, పెందుర్తి పాత గ్రామం, తెలకల వీధి, జెడ్పీహెచ్ఎస్ ఏరియా, ప్రశాంతి నగర్, క్రాంతి నగర్, వుడా కాలనీ, రైల్వే కాలనీ, ప్రశాంతి నగర్, సావిత్రి నగర్, అప్పన్నపాలెం, సింహపురి లే అవుట్, అడవివరం, ఎస్సీ కాలనీ, పాత అడవివరం, అడవివరం తదితర ప్రాంతాల్లో నీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. నగర ప్రజలు సహకరించవలసిందిగా ప్రకటనలో కోరారు. ప్రత్యామ్నాయంగా ట్యాంకర్ల ద్వారా పలు ప్రాంతాలకు నీటి సరఫరా చేసేందుకు చర్యలు తీసుకున్నట్టు కార్యనిర్వాహక ఇంజనీరు పేర్కొన్నారు.

రాత్రికి రాత్రే బడ్డీల ఏర్పాటు

» పెదగదిలి జంక్షన్ సమీపంలో వంతెన వద్ద అనుమతులు లేకుండా దుకాణాలు
» స్థానిక నేతలు, అధికారుల సహకారం ఉందంటూ ఆరోపణలు
» ట్రాఫిక్‌కు ఇబ్బందులు తప్పవంటున్న స్థానికులు



పెదగదిలి జంక్షన్ సమీపంలో కొత్తగా నిర్మించిన వంతెన సమీపంలో ఏర్పాటు చేసిన దుకాణాలు

ఆరిలోవ, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : పెదగదిలి జంక్షన్ సమీపంలో ఇటీవల నిర్మించిన వంతెనకు ఆనుకొని ఎలాంటి అనుమతులు లేకుండా పలువురు బడ్డీలను ఏర్పాటు చేస్తున్నారు. ఇక్కడ బడ్డీలను ఏర్పాటు చేయడం వల్ల ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతుందని స్థానికులు అంటున్నారు. ఇక్కడ బడ్డీల ఏర్పాటు కు కొందరు స్థానిక రాజకీయ నేతలు సహకరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. పేదలకు జీవనోపాధి చూపుతున్నామని చూపుతూ వారి వద్ద కొంత డబ్బు తీసుకుని బడ్డీలు ఏర్పాటు చేస్తున్నట్టు తెలుస్తుంది. మరికొందరు కొంత స్థలాన్ని ఆక్రమించి బడ్డీలను ఏర్పాటు చేసి, వాటిని అద్దెకు ఇస్తూ వ్యాపారం మొదలు పెట్టారన్న ప్రచారం కూడా ఉంది. ఇందుకు కొందరు జీవీఎంసీ అధికారులు కూడా ఇతోధిక సహకారం అందిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఏమైనా ఇక్కడ దుకాణాలు ఏర్పాటు చేస్తే ట్రాఫిక్ సమస్య ఎదురవుతుందని స్థానికులు అంటున్నారు. జీవీఎంసీ ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని ముందే జాగ్రత్త పడడం మంచిదని సూచిస్తున్నారు.

15 వరకూ పశువులకు టీకాలు

ఆరిలోవ, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : పశు సంవర్థక శాఖ ఆధ్వర్యంలో గత నెల జనవరి 20 నుంచి 31 వరకు 40 శాతం పశువులకు రోగ నిరోధక టీకాలు వేయడం జరిగిందని ఆ శాఖ సంయుక్త సంచాలకులు రామకృష్ణ తెలిపారు. టీకాలు వేయని పశువులకు ఈ నెల 15వ తేదీ వరకు వ్యాధి నిరోధక టీకాలు వేయనున్నట్టు చెప్పారు. ఈ అవకాశాన్ని పాడి రైతులు ఉపయోగించుకోవాలని కోరారు.

పకడ్బందీగా తరగతులు నిర్వహించాలి

» ఏయూ వీసీ శశిభూషణరావు



విద్యార్థులతో ముచ్చటిస్తున్న వీసీ శశిభూషణ్‌రావు

వెంకోజీపాలెం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : ఏయూలోని ప్రతి విభాగంలో పటిష్ఠంగా తరగతుల నిర్వహణ జరపాలని వీసీ జి.శశిభూషణరావు అన్నారు. గురువారం ఆయన ఆర్ట్స్ కళాశాల పరిధిలోని సోషల్ వర్క్, సోషియాలజీ, జర్నలిజం విభాగాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తరగతుల నిర్వహణను ఆయన ప్రత్యక్షంగా పరిశీలించారు. విభాగాధిపతులతో మాట్లాడారు. తరగతులు జరుగుతున్న విధానం తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులతో ముచ్చటించి సమస్యలు తెలుసుకున్నారు. విభాగాలలో ఎటువంటి సమస్యలు ఉన్నా తమ దృష్టికి వెంటనే తీసుకురావాలని సూచించారు.

ఆచార్యులు, గెస్ట్ ఫ్యాకల్టీ ప్రతిరోజు తరగతుల నిర్వహించాలని స్పష్టం చేశారు. విశ్వవిద్యాలయంలో బోధన పరిశోధన ప్రమాణాలను అత్యుత్తమంగా నిలపడంతో పాటు నిరంతరం మెరుగుపరిచే దిశగా ఆచార్యులు కృషి చేయాలని సూచించారు.

స్పోర్ట్స్‌మీట్ : ఎమ్మెల్యేకు ఆహ్వానం



ఎమ్మెల్యే వెలగపూడికి ఆహ్వాన పత్రిక అందిస్తున్న విద్యుత్ శాఖ ఉద్యోగులు

ఎంవీపీ కాలనీ, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర విద్యుత్తు శాఖ ఉద్యోగుల సంఘం వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించనున్న స్పోర్ట్స్ మీట్‌కు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబుకు ఆహ్వాన పత్రిక అందించారు. ఎంవీపీ కాలనీలోని ఎమ్మెల్యే కార్యాలయంలో వెలగపూడిని కలిసిన వారిలో యూనియన్ సభ్యులు వీఎస్ఆర్‌కె గణపతి, గురునాథరావు, చిరంజీవి రావు, నూకరాజు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఎఫ్ఎస్ఐ నిర్ధారించిన పేపర్ ప్లేట్లనే వాడాలి

» విశాఖ జిల్లా సహాయ ఆహార పరిరక్షణ అధికారి నందజీ



చిరు వర్తకులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

రామ్‌నగర్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : బీచ్ రోడ్డు పరిధిలో వ్యాపారాలు నిర్వహించే వారంతా ఎఫ్ఎస్ఐ (ఫ్లోర్ స్పేస్ ఇండెక్స్) నిర్ధారించిన పేపర్ ప్లేట్లనే ఉపయోగించాలని విశాఖ జిల్లా సహాయ ఆహార పరిరక్షణ అధికారి జీఎబీ నందజీ స్పష్టం చేశారు. గురువారం బీచ్‌రోడ్డులో వ్యాపారులతో సమావేశాన్ని నిర్వహించి అవగాహన కల్పించారు. విశాఖ నగర బీచ్ వీధి వ్యాపారస్తుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కోస్టల్ బ్యాటరీ నుంచి వుడా పార్కు బీచ్ రోడ్డు వరకూ మురీమిక్చర్, ఇతర చిరు వ్యాపారాలు చేసే వారితో ఫుడ్ సేఫ్టీ గురించి అవగాహన కల్పించారు.

ఈ సందర్భంగా నందజీ మాట్లాడుతూ పేపర్లలో ఆహార పదార్థాలు అందిస్తూ వ్యాపారాలు చేస్తే కేన్సర్ వంటి ప్రమాదకర వ్యాధులు వ్యాప్తి చేసిన వారు అవుతారన్నారు. అందుకే పేపర్లు, పాలిథిన్ కవర్లు వంటివి వాడవద్దని స్పష్టం చేశారు. కేవలం ఎఫ్ఎస్ఐ నిర్ధారించిన పేపర్ ప్లేట్‌లు మాత్రమే వినియోగించాలన్నారు. అంతేకాకుండా ఎక్కువ సమయం నిలువ ఉంచిన ఆహార పదార్థాలను అమ్మకాలు చేయరాదన్నారు. ముఖ్యంగా వ్యాపారస్తులు పరిశుభ్రంగా ఉండాలన్నారు. వినియోగదారులతో గౌరవంగా ఉంటూ నాణ్యమైన ఆహారం మాత్రమే అందించాలన్నారు. ఈ సమావేశంలో జీవీఎంసీ ఆహార భద్రతా అధికారి జి.అప్పారావు అసోసియేషన్ సభ్యులు చీడం రమణ, తెడ్డు శంకర్, గిడుతూరు శ్రీను, దుండి త్రినాథరావు, కట్టా శ్రీను పాల్గొన్నారు.

అరకు, కొత్తవలస రైల్వే లైన్‌ను విశాఖ డివిజన్‌లోనే కొనసాగించాలి

» డీఆర్ఎంను కలిసిన బీజేపీ నేతలు



డిఆర్ఎం మనోజ్ సాహును కలిసిన బీజేపీ నేతలు పరశురామ్‌రాజు, దామోదర్ యాదవ్, సుబ్రహ్మణ్యం, మురళీమోహన్‌రాజు

పెదవాల్తేరు, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : అరకు, కొత్తవలస రైల్వే లైన్‌ను విశాఖపట్నం డివిజన్ పరిధిలోనే ఉంచాలని కోరుతూ రైల్వే డీఆర్ఎం మనోజ్ సాహును బీజేపీ విశాఖపట్నం పార్లమెంటరీ జిల్లా అధ్యక్షుడు ఎంఎంఎన్ పరశురామ్‌రాజు, పూర్వపు రైల్వే జడ్ఆర్‌యూసీ మెంబర్ జీసీ నాయుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి దామోదర్ యాదవ్, జిల్లా ఉపాధ్యక్షులు సుబ్రహ్మణ్యం, తూర్పు నియోజకవర్గం కన్వీనర్ మురళీమోహన్ రాజు తదితరులు కోరారు. ఈ సందర్భంగా పరశురామ్‌రాజు మాట్లాడుతూ విశాఖపట్నం రైల్వే డివిజన్‌కు ఆదాయపరంగా, పర్యాటక కేంద్రంగా ఉన్న అరకును ఒడిశాకు అప్పగించడం వల్ల కొన్ని ఇబ్బందులు ఎదురవుతాయన్నారు. పర్యాటక ప్రాంతం కావడంతో ఇక్కడ సినీ షూటింగ్‌లు జరుగుతుంటాయని, ఇకపై వాటి అనుమతుల కోసం భువనేశ్వర్‌కు వెళ్లాల్సి ఉంటుందన్నారు. దీనివల్ల ఆదాయం తగ్గిపోతుందన్నారు. అలాగే ఐరన్ ఓర్ ద్వారా వచ్చే ఆదాయం కూడా కోల్పోతామని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే ఈ ప్రతిపాదనను విరమించుకొని అరకు, కొత్తవలస లైన్‌ను విశాఖపట్నం డివిజన్‌లోనే కొనసాగించాలని కోరారు.

తీరంలో తాబేళ్ల మృత్యు ఘోష

సంతానోత్పత్తికి వచ్చి వేలాదిగా చనిపోతున్న కూర్మాలు

- మరణశాసనం రాస్తున్న వలలు, కాలుష్యం
- ఏపీ తీరంలో గత నెలలో 3,085 మృత్యువాత
- జాగ్రత్త చర్యలు తీసుకుంటున్న ఒడిశా, తమిళనాడు
- మన రాష్ట్రంలో చట్టాల అమలులో ఉదాసీనత
- మత్స్యకారులు అవగాహన పెంచుకోవాలంటున్న నిపుణులు
- హాని కలిగించే వలలు వినియోగంచవద్దని వినతి

విశాఖపట్నం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): తూర్పుతీరంలో ఒడిశా, తమిళనాడులతో పోల్చితే మన రాష్ట్రంలో ఎక్కువగా సముద్ర తాబేళ్లకు ప్రమాదం పొంచి ఉంది. ముఖ్యంగా తీరంలో విపరీతమైన కాలుష్యంతో పాటు మత్స్యకారుల చేపల వేటలో వచ్చిన మార్పులతో తాబేళ్లు ఎక్కువగా మృత్యువాత పడుతున్నాయి. మత్స్య, అటవీ, ఇతర ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం లేకపోవడం, చట్టాల అమలులో కఠినంగా వ్యవహరించకపోవడం కూడా మరో కారణం. ప్రస్తుత సీజన్‌లో ముఖ్యంగా గత నెలలో ఏపీ తీరంలో 3,085 తాబేళ్లు చనిపోయాయి. దీనికి సంబంధించి 'ట్రీ ఫౌండేషన్' అనే సంస్థ గత నెలలో ఒక సర్వే చేపట్టింది. ఎల్‌నినో ప్రభావంతో సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు పెరగడంతో 2023 నవంబరు నుంచి 2024 మార్చి/ఏప్రిల్ వరకూ తూర్పుతీరంలో తాబేళ్ల రాక బాగా తగ్గింది. అయితే గత ఏడాది ఏప్రిల్ తరువాత ఎల్‌నినో బలహీనపడడంతో సముద్రంలో వాతావరణం తాబేళ్లకు అనుకూలంగా మారింది. దీంతో గత ఏడాది నవంబరు నుంచి సముద్ర తాబేళ్ల రాక మొదలైంది. డిసెంబరు నుంచి వీటి సంఖ్య పెరిగింది. జనవరిలో కూడా వేల సంఖ్యలో తాబేళ్లు వచ్చినట్టు గుర్తించారు.



తీరంలో మృతిచెందిన తాబేళ్లు



తీరానికి సమీపంలోనే ప్రమాదం

తాబేళ్లు ప్రతి 45 నిమిషాలకు ఒకసారి శ్వాస తీసుకునేందుకు సముద్ర ఉపరితలంపైకి వస్తాయి. సముద్ర తాబేళ్లు ఎక్కువ కాలం తీరానికి దూరంగానే గడుపుతాయి. అప్పుడు వాటికి పెద్దగా ప్రమాదం ఉండదు. సంతానోత్పత్తి కోసం తీరానికి ఐదు కిలోమీటర్ల దూరంలోకి వచ్చినప్పుడు ఎక్కువగా ప్రమాదం బారిన పడతాయి. సముద్రంలో చేపల వేటకు వెళ్లే మత్స్యకారులు టేకు వలలు సహా ఇతర రకాల వలలు వినియోగిస్తారు. వలల్లో చిక్కుకునే తాబేళ్లు ఉపరితలంపైకి వచ్చి శ్వాసతీసుకునే అవకాశంలేకుండా గంటలకొద్దీ నీటిలోనే ఉండిపోవడంతో ఊపిరాడక చనిపోతున్నాయి. ఏపీ మెరైన్ ఫిషరీస్ రెగ్యులేషన్ యాక్టు ప్రకారం తీరం నుంచి ఎనిమిది కిలోమీటర్లు దాటిన తరువాతే చేపల వేట చేయాలి. తీరం నుంచి కిలోమీటరు నుంచి రెండు కిలోమీటర్లు దూరంలోనే చేపల వేట చేస్తుండడంతో సంతానోత్పత్తి కోసం వచ్చే తాబేళ్లు చనిపోతున్నాయని 'ట్రీ ఫౌండేషన్' చైర్‌పర్సన్ సుప్రజ ధారి పేర్కొన్నారు. గిల్ నెట్ (కోనావల), అటుక వల, టేకు వలలు, శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల సంప్రదాయ మత్స్యకారులు వాడే నానాజాతి వలల్లో పడి వందలాది తాబేళ్లు చనిపోతున్నాయని ఆమె ఆందోళన వ్యక్తంచేశారు. గత నెలలో అత్యధికంగా బాపట్ల జిల్లాలో 529, తరువాత విజయనగరం జిల్లాలో 501, ప్రకాశంలో 453, శ్రీకాకుళంలో 363, కృష్ణాలో 334, కాకినాడలో 220, అనకాపల్లిలో 202, నెల్లూరులో 192, విశాఖపట్నంలో 146, తిరుపతి జిల్లాలో 145 తాబేళ్లు చనిపోయినట్టు ట్రీ ఫౌండేషన్ సర్వేలో తేలింది. అలాగే ఇటీవల కాలంలో తీరంలో పెరుగుతున్న కాలుష్యానికి కూడా ఊపిరాడక కొన్ని చనిపోతున్నాయని పర్యావరణ నిపుణులు చెబుతున్నారు.

ఒడిశాలో కొన్ని రకాల వలలు నిషేధం

నవంబరు నుంచి మార్చి/ఏప్రిల్ వరకు గల్ఫ్ ఆఫ్ మన్నార్ పరిసరాల్లో సముద్రంలో జీవించే తాబేళ్లు గుడ్లు పెట్టేందుకు తమిళనాడు నుంచి ఒడిశా వరకూ తీరానికి వస్తుంటాయి. అందుకే ఒడిశా తీరంలో అక్టోబరు నుంచి ఏప్రిల్ వరకు తీరం నుంచి 20 కిలోమీటర్ల దూరం వరకు సముద్రంలో కొన్నిరకాల వలలతో చేపల వేటను నిషేధించారు. దీనికితోడు తాబేళ్లు తీరానికి వచ్చే జాడలు కనిపిస్తే.. అటు వైపు మత్స్యకారులు కూడా చేపల వేటకు వెళ్లరు. గత నెలలో తమిళనాడులో భారీగా తాబేళ్లు మృత్యువాత పడడంతో అక్కడ ప్రభుత్వం అప్రమత్తమై కొన్ని రకాల వలల వాడకంపై నిషేధం విధించింది. ఏపీలో ఇంతవరకూ అటువంటి చట్టాల అమలుపై అధికారులు దృష్టిసారించలేదు.

అవగాహన పెంచుకోవాలి

మత్స్యకారులకు ఎంతో మేలు చేసే తాబేళ్ల సంరక్షణపై అవగాహన పెంచుకోవాలని, వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని సుప్రజ ధారి అన్నారు. అటవీశాఖ భాగస్వామ్యంతో మత్స్యకారులకు తమ సంస్థ పలు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోందని చెప్పారు. సముద్రంలో చేపలు గుడ్లు పెట్టే ప్రాంతంలో గడ్డి, పాచిని తాబేళ్లు తిని అక్కడ శుభ్రం చేస్తాయన్నారు. చేపలు అక్కడకు వచ్చి గుడ్లు పెట్టడంతో వాటి అభివృద్ధి జరిగి, మత్స్యకారుల జీవనోపాధి మెరుగుపడుతుందన్నారు. తమకు మేలు చేసే తాబేళ్లను రక్షించుకోవాలని మత్స్యకారులకు ఆమె సూచించారు. తాబేళ్లకు ఇబ్బందికరం కాని ప్రత్యేక వలలు వాడాలని సూచించారు. వలలో చిక్కుకునే తాబేలు బయటకు రావడానికి ప్రత్యేకంగా రూపొందించిన 'టెడ్' (టర్టిల్ ఎక్స్‌క్లూడర్ డివైజ్)ను వినియోగించాలన్నారు. ఇటువంటి డివైజ్‌లు వాడినప్పుడు వలలో పడిన తాబేళ్లు కేవలం నాలుగైదు శాతం చేపలు మాత్రమే బయటకు వస్తాయని, చేపలు వలలోనే ఉంటాయన్నారు. తీరం నుంచి ఎనిమిది కిలోమీటర్ల వరకు చేపల వేట చేసే బోట్లను ఇండియన్ కోస్టుగార్డు పర్యవేక్షించాలని ఆమె కోరారు.

క్రైం... crime news

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

గోపాలపట్నం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. ఈ సంఘటన గోపాలపట్నం బస్టాప్ వద్ద గురువారం జరిగింది. చంద్రనగర్‌కు చెందిన వమ్మి ఆదినారాయణ రెండో కుమారుడు వెంకట బాలాజీ (26) ఇంజనీరింగ్ పూర్తిచేసి డాక్‌యార్డ్‌లో అప్రంటీస్ చేస్తున్నాడు. ఐటీ కంపెనీలో పని చేస్తున్న తమ్ముడు వేణుగోపాల్‌ను బస్టాపులో దించేందుకు ఉదయం 7 గంటలకు ద్విచక్ర వాహనంపై బయలుదేరాడు. గోపాలపట్నం బస్టాపువద్ద సోదరుడిని దింపి, తిరిగి ఇంటికి వస్తుండగా సర్వీస్ రోడ్డులో ఎన్ఏడీ నుంచి గోపాలపట్నం బంక్ వైపు వస్తున్న రఘు ఇంజనీరింగ్ కళాశాల బస్సు వెనుక నుంచి బలంగా ఢీ కొంది. రోడ్డుపై పడిపోయిన బాలాజీ తలపై నుంచి బస్సు వెళ్లిపోవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ట్రాఫిక్ సీఐ శ్రీనివాసరావు, క్రైం ఎస్ఐ అప్పలనాయుడు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. బస్సు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని బస్సును స్టేషన్‌కు తరలించారు. మృతుని కుటుంబీకులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



వెంకట బాలాజీ (ఫైల్)

చంద్రనగర్‌లో విషాద ఛాయలు

కార్పెంటర్‌గా పనిచేస్తున్న ఆదినారాయణ తన ముగ్గురు కుమారులను ఉన్నత విద్యలు చదివించాడు. భార్య రమ కూలిపని చేస్తూ కుటుంబానికి ఆసరాగా నిలుస్తోంది. చేతికి అందొచ్చిన కుమారుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో కుటుంబమంతా కన్నీరుమున్నీరుగా విలపిస్తోంది. సౌమ్యుడైన వెంకట బాలాజీ మృతితో కాలనీలో విషాదఛాయలు అలముకున్నాయి. వెంకటబాలాజీ అంత్యక్రియల్లో పెద్దసంఖ్యలో కాలనీవాసులు పాల్గొన్నారు.

2,240 కిలోల రేషన్ బియ్యం పట్టివేత

మల్కాపురం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. దుర్గానగర్‌కు చెందిన అచ్చిబాబు ఆటోలో 1,600 కిలోలు, ఏఎస్ఆర్ కాలనీకి చెందిన అప్పలరాజు 640 కిలోల బియ్యం తరలిస్తుండగా మల్కాపురం ప్రాంతంలో పట్టుకున్నారు. బియ్యం ఎక్కడి నుంచి సేకరించారు...ఎక్కడికి చేరవేస్తున్నారు, దీని వెనుక ఎవరున్నారనే అంశాలపై దర్యాప్తు చేస్తున్నామన్నారు. బియ్యాన్ని తరలిస్తున్న ఇద్దరిపై కేసు నమోదుచేశామన్నారు. స్వాధీనంచేసుకున్న సరకును రెవెన్యూ అధికారులకు అప్పగిస్తామన్నారు.

డాక్టర్ శ్రీవాత్సవ్‌కు ధన్వంతరీ గోల్డ్ మెడల్

విశాఖపట్నం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): నగరానికి చెందిన ప్రముఖ కీళ్ల వైద్య నిపుణులు, విమ్స్ ఆర్థో విభాగాధిపతి కుమారుడు డాక్టర్ తాడికొండ భవానీ ప్రసాద్ కుమారుడు డాక్టర్ టి.కృష్ణ శ్రీవాత్సవ్ ధన్వంతరి గోల్డ్ మెడల్‌కు ఎంపికయ్యారు. ఇటీవల నగరంలో నిర్వహించిన ఆర్థోపెడిక్ సర్జన్ల రాష్ట్రస్థాయి సదస్సులో ఈ మెడల్‌ను నిర్వాహకులు ప్రకటించారు. జీఎస్ఎల్ మెడికల్ కాలేజీలో ఆర్థోపెడిక్ విభాగంలో డాక్టర్ ధీరజ్ మణికంఠ పీజీ విద్యార్థి. స్వతంత్ర హాస్పిటల్‌లో కన్సల్టెంట్ స్పైన్‌సర్జన్, ఆర్థో విభాగాధిపతిగా పనిచేస్తున్న డాక్టర్ వి.నాగేశ్వరరావు ఆధ్వర్యంలో చేసిన ఈ పరిశోధనపత్రాలను తాజాగా ఆర్థోపెడిక్ వైద్యుల సదస్సులో సమర్పించారు. ఈ పరిశోధనకు వచ్చే ఏడాది నిర్వహించనున్న సదస్సులో ధన్వంతరి మెడల్‌ను కర్నూలులో ప్రదానం చేయనున్నారు. ఈ సందర్భంగా శ్రీవాత్సవ్‌ను పలువురు వైద్యులు అభినందించారు.



డాక్టర్ శ్రీవాత్సవ్

8న దివ్యాంగుల క్రికెట్ క్రీడాకారుల ఎంపికలు

విశాఖపట్నం స్పోర్ట్స్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర క్రికెట్ సంఘం (ఏసీఏ) సూచనల మేరకు దివ్యాంగుల నూతన క్రికెట్ క్రీడాకారుల ఎంపికలు ఈ నెల 8న నిర్వహించనున్నట్టు డిఫెరెంట్లీ ఏబుల్డ్ క్రికెట్ కౌన్సిల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ చైర్మన్ యడ్లపల్లి సూర్యనారాయణ తెలిపారు. నగరంలోని ఏసీఏ వీడీసీఏ-బీ గ్రౌండ్‌లో ఆ రోజు ఉదయం 9 గంటల నుంచి జరిగే ఈ ఎంపికలలో పాల్గొనేందుకు విశాఖ, అనకాపల్లి జిల్లాలకు సంబంధించి శారీరక వైకల్యం ఉన్నవారు, అంధులు, చెవిటి, చక్రాల కుర్చీ కేటగిరీలకు చెందినవారు మాత్రమే అర్హులని స్పష్టంచేశారు. ఈ ఎంపికలలో పాల్గొనదలచినవారు తెల్లదుస్తులు ధరించి, సొంత కిట్‌తో హాజరుకావాలని సూచించారు. క్రీడాకారులందరికీ నిర్వాహకులు భోజన సదుపాయం ఏర్పాటు చేస్తున్నారని తెలిపారు. వివరాలకు వాసుపల్లి సురేష్ 9059525933 నంబరులో సంప్రదించాలన్నారు.

శ్రీ సంపత్ వినాయగర్ దేవాలయం

ఆశీలుమెట్ట, విశాఖపట్నం - 530003. ఫోన్: 0891-2760740

web: aptemple.ap.gov.in

ఆర్.సి.నెం. 9/25 — **ఇ-ప్రొక్యూర్మెంట్ టెండర్ - కం- బహిరంగవేలం** — తే.దీ. 06-02-2025

శ్రీ సంపత్ వినాయగర్ దేవాలయమునకు ఈ క్రింది తెలిపిన వస్తువుల సరఫరా కొరకు టెండర్లు కోరడమైనది.

క్రమ సంఖ్య	వస్తువు పేరు	కాలపరిమితి	ధరావతు సొమ్ము	టెండరు షెడ్యూలు ధర
1.	[illegible]	01-04-2025 నుండి 31-03-2026 వరకు	1,00,000/-	2,000/-
2.	[illegible]	01-04-2025 నుండి 31-03-2026 వరకు	50,000/-	2,000/-
3.	[illegible]	01-04-2025 నుండి 31-03-2026 వరకు	50,000/-	2,000/-
4.	[illegible]	01-04-2025 నుండి 31-03-2026 వరకు	5,000/-	500/-
5.	[illegible]	01-04-2025 నుండి 31-03-2026 వరకు	2,500/-	500/-
6.	[illegible]	01-04-2025 నుండి 31-03-2026 వరకు	2,500/-	250/-
7.	పాలు, పెరుగు మరియు మజ్జిగ సప్లయి చేయుటకు	01-04-2025 నుండి 31-03-2026 వరకు	2,500/-	250/-
8.	ప్రింటింగ్ & స్టేషనరీ సప్లయి చేయుట	01-04-2025 నుండి 31-03-2026 వరకు	2,000/-	200/-
9.	ఎలక్ట్రికల్ ఐటమ్స్ సప్లయి చేయుటకు	01-04-2025 నుండి 31-03-2026 వరకు	2,000/-	200/-
10.	[illegible]	01-04-2025 నుండి 31-03-2026 వరకు	10,000/-	200/-

షరతులు:
1. పై పేర్కొన్న వాటి టెండర్ షెడ్యూలు తేది: 07-02-2025 ఉ.గం.10.00ల నుండి తేది.23-02-2025 మధ్యాహ్నం గం.3.00ల వరకు టెండరు షెడ్యూలు ధర చెల్లించి పొందగలరు.
2. [illegible] టెండర్లు తేది.24-02-2025 ఉ.గం.10.00ల నుండి మధ్యాహ్నం గం.2.00ల వరకు స్వీకరించి అదేరోజు మధ్యాహ్నం గం.3.00 వరకు [illegible]
3. [illegible] ఉ.గం.4.00లకు వేలం వేయబడును.
4. శ్రీ సంపత్ దేవాలయమునకు కావలసిన [illegible] apeprocurement.gov.in ఇ-ప్రొక్యూర్మెంట్ ద్వారా టెండర్ వేయుకోవలెను.

టి.ఆర్.చోజన్ — ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్
టి. అన్నపూర్ణ — సహాయ కమీషనరు, కార్యనిర్వాహణాధికారిణి

AJC CLASSIFIEDS

CHANGE OF NAME

★ I, KOYYA SYAMA SUNDARA RAO (Old Name), S/o. Koyya Lingaraju, R/o. 3-178, Yeguva street, Sanyasiputtuga, Ichapuram, Srikakulam. Change my name from KOYYA SYAMA SUNDARA RAO (Old Name) to KOYYASYAMSUNDAR (New Name). Henceforth I am being called as KOYYA SYAMSUNDAR (New Name) for all purposes.
AJV_231068

CHANGE OF NAME

★ I, RAVANAM VEERA VENI, W/o. Ravanam Kanakaraju, previously called Ravanam Veraveni, Resident of Flat No.503, Laxmi Paradise, Durganagar, Madhurawada, Visakhapatnam-530048. Now changed my name from RAVANAM VERAVENI to RAVANAM VEERA VENI. Hence forth I will be called as RAVANAM VEERA VENI for all purpose.
AJV_231069

CHANGE OF NAME

★ I, PADAMATA LAKSHMIKALYANI (Old Name), W/o. Padamata Venkata Rao, R/o.2-98/11, Plot No.170, Bindira Nagar, Midhilapuri Vuda Colony, VSP-41. Change my name from PADAMATA LAKSHMIKALYANI (Old Name) to PADAMATA KOTESWARI (New Name). Henceforth I am being called as PADAMATA KOTESWARI (New Name) for all purposes.
AJV_231070

PROPERTY FOR SALE

★ 200 Sq.Yds Plot - Valimeraka, Pendurthi (M), Vizag. Plot No.33, Price Negotiable Rs 20,000 Sq.Yds.
Mob: 9491239203 AJH-41328

DANCE CLASSES

★ Home Tutions for Western Dance, Weight Loss Programs and Personal Physical Fitness Training will be taken. Contact : 8822681025
AJV_231043

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

For Advertisement Contact :
9963231176
9966165093

పారిశ్రామికవేత్తలు ప్రోత్సాహకాలను వినియోగించుకోవాలి

అక్కిరెడ్డిపాలెం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ఎగుమతులను ప్రోత్సహించేందుకు దువ్వాడ ఎస్ఈజెడ్‌లో వున్న వివిధ సదుపాయాలను పారిశ్రామికవేత్తలు వినియోగించుకోవాలని ఐఆర్ఎస్ఎంఈ డెవలప్‌మెంట్ కమిషనర్ ఎం.శ్రీనివాస్ అన్నారు. ఎంఎస్ఎంఈ, డీజీఎఫ్‌టీ, వాసివా, ఏపీ చాంబర్స్ సహకారంతో గురువారం షీలానగర్‌లో ఏర్పాటుచేసిన ఎగుమతి ప్రోత్సాహం, ఎంఎస్ఎంఈ, నిరాయత్ బంధు పథకంపై నిర్వహించిన జాతీయ వర్కుషాప్‌లో ఆయన మాట్లాడుతూ పారిశ్రామిక ఎగుమతులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వ పథకాలతో పాటు ఎస్ఈజెడ్‌లో కల్పించిన సదుపాయాలను పారిశ్రామికవేత్తలు వినియోగించుకోవాలన్నారు. సదస్సులో భారత విదేశీ వాణిజ్య సంస్థ (డీజీఎఫ్‌టీ) కస్టమ్స్ విభాగం, ఎగుమతి క్రెడిట్ గ్యారెంటీ కార్పొరేషన్, ఎగుమతి తనిఖీ మండలి, నేషనల్ ఇన్సూరెన్స్ కంపెనీ ప్రతినిధులు పథకాలు, విధానాలను వివరించారు. సదస్సులో డీజీఎఫ్‌టీ అధికారి ప్రకాశ్‌సింగ్, జిల్లా పరిశ్రమల కేంద్రం జీఎం వి.ఆదిశేషు, చిత్తరంజన్ దత్త, ప్రభాత్‌కుమార్, ప్రసాద్ జాంబాల, అనార్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.



వర్కుషాప్‌లో ప్రసంగిసున్న శ్రీనివాస్

ద్విచక్రవాహనం ఢీకొని వ్యక్తి మృతి

ఆనందపురం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): రోడ్డు దాటుతున్న వ్యక్తిని ద్విచక్రవాహనం బలంగా ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ సంఘటన గంభీరం ఐఐఎం రోడ్డులో గురువారం ఉదయం జరిగింది. సీఐ చింతా వాసునాయుడు తెలిపిన వివరాల మేరకు... మండలంలోని గొట్టిపల్లి గ్రామానికి చెందిన చింతాడ రవి (53) గంభీరం సమీపంలోని ఐఐఎం రోడ్డులో ఉన్న సమైక్య అపార్టుమెంటులో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. గురువారం డ్యూటీకి బయలుదేరి ఆటో లో ఐఐఎం రోడ్డు వద్దకు చేరుకుని, దాటుతుండగా విశాఖ నుంచి ఆనందపురం వైపు వస్తున్న బైక్ ఢీకొని పరారయింది. ఈ సంఘటనలో రవి తలకు బలమైన గాయాలవడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భీమిలి ఆస్పత్రికి తరలించి, మృతుడి కుమార్తె చింతాడ భవానీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామన్నారు.



పన్ను చెల్లింపుదారులు నేరుగా కలిసే అవకాశం

- కస్టమ్స్ అండ్ సెంట్రల్ టాక్స్ చీఫ్ కమిషనర్ సంజయ్ రథి

విశాఖపట్నం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం జోన్‌లో పన్ను చెల్లింపుదారులు, టాక్స్ కన్సల్టెంట్లు ప్రతి బుధవారం ముందస్తు అపాయింట్‌మెంట్ లేకుండా తమను కలవవచ్చునని కస్టమ్స్ అండ్ సెంట్రల్ టాక్స్ చీఫ్ కమిషనర్ సంజయ్ రథి చెప్పారు. నగరంలోని ఓ హోటల్‌లో గురువారం 'పోస్టు బడ్జెట్ విశ్లేషణ..జీఎస్‌టీ' నే అంశంపై నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. విశాఖపట్నం జోన్‌లో 99 శాతం మంది పన్ను చెల్లింపుదారులు గడువులోగా రిటర్న్‌లు వేస్తున్నారన్నారు. అయితే జీఎస్‌టీఆర్-3బి రిటర్న్‌లను మాత్రం 80-85 శాతమే దాఖలు చేస్తున్నారన్నారు. వ్యాపారాన్ని మరింత సులభతరం చేసేందుకు శాఖాపరంగా సహకరిస్తామని, సేవలు ఉపయోగించుకోవాలన్నారు. అసిస్టెంట్ కమిషనర్ ఫ్రెడ్రిక్ ఆంథోనీ ఇన్వాయిస్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో సీఐఐ విశాఖపట్నం చైర్మన్ గ్రంధి రాజేశ్, టాక్సేషన్ కన్వీనర్ అనిల్ బెజవాడ, అనీశ్ చౌదరి, వ.మౌళి, శ్రీకాంత్ తదితరులు పాల్గొని మాట్లాడారు.



పోస్టు బడ్జెట్ సమావేశంలో పాల్గొన్న కస్టమ్స్ అండ్ సెంట్రల్ టాక్స్ ఉన్నతాధికారులతో సీఐఐ ప్రతినిధులు

అన్న క్యాంటీన్‌లో దర్శకుడు అమ్మ రాజశేఖర్ భోజనం

- పేదలకు ప్రభుత్వం మంచి ఆహారాన్ని అందించడం హర్షణీయం

సీతమ్మధార, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): నగరంలోని రామా టాకీస్ రోడ్డులో ప్రభుత్వ ప్రాంతీయ కంటి ఆసుపత్రి వద్ద గల అన్న క్యాంటీన్‌లో గురువారం దర్శకుడు, డ్యాన్స్ మాస్టర్ 'అమ్మ' రాజశేఖర్, 'జబర్దస్త్' ఫేమ్ ముక్కు అవినాష్, తల చిత్రం ద్వారా హీరోగా పరిచయం అవుతున్న రాగిణి రాజ్‌లు భోజనం చేశారు. భోజనం కోసం సామాన్య ప్రజలతో కలిసి క్యూలో నిల్చున్నారు. ఈ సందర్భంగా దర్శకుడు అమ్మ రాజశేఖర్ మాట్లాడుతూ పేదల కోసం ఏర్పాటుచేసిన అన్న క్యాంటీన్‌లో భోజనం చేయడం ఆనందంగా ఉందన్నారు. పేదలకు ప్రభుత్వం మంచి ఆహారాన్ని అందించడం హర్షణీయమన్నారు.



అన్న క్యాంటీన్‌లో భోజనం చేస్తున్న దర్శకుడు అమ్మ రాజశేఖర్, కథానాయకుడు రాగిణి రాజ్, ముక్కు అవినాశ్

ఊహకందని కథతో 'తల'


సిరిపురం: ఊహకందని విధంగా సాగే కథతో 'తల' చిత్రం సాగుతుందని దర్శకుడు అమ్మ రాజశేఖర్ తెలిపారు. గురువారం సిరిపురంలోని ఓ హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల విడుదలైన ట్రైలర్‌కు అద్భుత స్పందన వచ్చిందన్నారు. ఈ చిత్రాన్ని ఈ నెల 14న ప్రపంచ వ్యాప్తంగా విడుదల చేస్తున్నట్టు చెప్పారు. 'తల' సినిమాతో వయలెంట్ వాలంటైన్స్ డే అవుతుందని తెలిపారు. హీరో రాగిణిరాజ్ మాట్లాడుతూ తాను మంచి కంటెంట్ ఉన్న కథతో హీరోగా ప్రేక్షకుల ముందుకు రాబోతుండడం ఆనందంగా ఉందన్నారు. హాస్య నటుడు అవినాశ్ మాట్లాడుతూ కచ్చితంగా ఈ ప్రేమికుల దినోత్సవం నాడు వైలెంట్ వాలెంటైన్‌గా ఉంటుందన్నారు. సహ నిర్మాత రాధారాజశేఖర్ మాట్లాడుతూ 'తల' ప్రేక్షకులందరినీ అలరిస్తుందన్నారు. దీప ఆర్ట్స్ బ్యానర్‌పై శ్రీనివాస్ గౌడ్ సమర్పణలో చిత్రం రాబోతోంది.



విద్యార్థిని పట్ల ఉపాధ్యాయుడి అసభ్య ప్రవర్తన

- దేహశుద్ధి చేసి స్తంభానికి కట్టేసిన బాలిక కుటుంబీకులు
- స్టేషన్‌కు తరలించిన పోలీసులు: డీఈవో విచారణ

బుచ్చెయ్యపేట, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి జిల్లా బుచ్చెయ్యపేట మండలం వడ్డాది జంక్షన్‌లో గల నేషనల్ టాలెంట్ స్కూల్‌లో తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థిని పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన ఉపాధ్యాయుడికి బాలిక కుటుంబ సభ్యులు, బంధువులు గురువారం దేహశుద్ధి చేశారు. అనంతరం స్తంభానికి కట్టేశారు. బాధితురాలి కథనం ప్రకారం తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థిని సందేహాలు నివృత్తి చేసుకోవడానికి బుధవారం మధ్యాహ్నం లెక్కల ఉపాధ్యాయుడు దారపు గంగాప్రసాద్ వద్దకు వెళ్లింది. కొద్దిసేపటి తరువాత రమ్మని చెప్పడంతో సాయంత్రం వెళ్లింది. విద్యార్థిని వెళ్లిన వెంటనే క్లాస్ రూమ్ తలుపులు దగ్గరగా వేసిన ఉపాధ్యాయుడు ఆమె చేయి పట్టుకుని అసభ్యంగా ప్రవర్తించాడు. దీంతో బాలిక ఏడుస్తూ స్కూల్ ఆయాకు చెప్పింది. ఈ సమాచారం తెలిసి విద్యార్థిని తల్లిదండ్రులు స్కూల్‌కు వచ్చి ఆమెను ఇంటికి తీసుకువెళ్లారు. విద్యార్థిని జరిగిన ఘటన గురించి తల్లిదండ్రులకు చెప్పడంతో గురువారం ఉదయం వారు, వారి కుటుంబ సభ్యులు పాఠశాల వద్దకు చేరుకున్నారు. ఉపాధ్యాయుడు గంగాప్రసాద్ మరో పాఠశాలలో ఉన్నట్టు తెలుసుకుని అక్కడకు వెళ్లి కొట్టుకుంటూ ఘటన జరిగిన స్కూల్‌కు తీసుకువచ్చి స్తంభానికి కట్టేశారు. పోలీసులు చేరుకుని గంగాప్రసాద్‌ను స్టేషన్‌కు తరలించారు. ఈ వ్యవహారం సోషల్ మీడియాలో వైరల్‌గా మారడంతో హోం మంత్రి ఆదేశాల మేరకు కొత్తకోట సీఐ కోటేశ్వరరావు, బుచ్చెయ్యపేట ఎస్ఐ శ్రీనివాసరావు వడ్డాదిలోని ప్రైవేటు స్కూల్‌కు వెళ్లి వివరాలు సేకరించారు. జిల్లా విద్యాశాఖాధికారి గిడ్డి అప్పారావునాయుడు ప్రిన్సిపాల్ రామరాజు నుంచి వివరాలు సేకరించారు. విద్యార్థిని పట్ల అసభ్యంగా ప్రవర్తించిన ఉపాధ్యాయుడు నేషనల్ టాలెంట్ స్కూల్‌తో పాటు, మండలంలోని మరో రెండు స్కూళ్లలో లెక్కలు బోధిస్తున్నట్టు చెబుతున్నారు. విద్యార్థిని పట్ల అసభ్యంగా ప్రవర్తించిన ఉపాధ్యాయుడిని కఠినంగా శిక్షించాలని కుటుంబీకులు, స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.



ఉపాధ్యాయుడు గంగాప్రసాద్‌ను స్తంభానికి కట్టేసిన దృశ్యం

